MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 21 సంచిక: 10 రంగారెడ్డి జూన్ 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ ఎఫ్ పి ఓలచే ముమ్మరంగా మామిడి మార్కెటింగ్ !


కాయ నాణ్యత దెబ్బతికుండా కవర్లతో రక్షణ


నోరూరించే నాణ్యమైన కాయలు


గ్రేడింగ్‌చేసి రవాణాకు సిద్ధంచేస్తూ


కర్నూలుజిల్లా తడకనపల్లెలో ఉల్లి, టమాటో సోలార్ డ్రైయింగ్ యూనిట్లను పరిశీలిస్తున్న శ్రీ సి ఎస్, శ్రీ చిరంజీవి చౌదరి



బీహార్‌లో ఎఫ్ పి ఓల స్థితిగతులపై పాట్నాలో ఏపిమాస్, జీవిక రాష్ట్రస్థాయి సదస్సులో శ్రీ సి ఎస్ ప్రభృతులు

ఎస్ హెచ్ జి సమాఖ్యలపై జాతీయస్థాయి శిక్షణ





పుట్టపర్తిలో చిరుధాన్యాల మహోత్సవం


తెలంగాణా సెర్ప్ ఆధ్వర్యంలోని జిల్లా సమాఖ్యల పై ఏపిమాస్ కార్యశాల


వాతావరణాధారిత వ్యవసాయంపై నల్లమాడలో సదస్సు


విప్రో ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీ భాగస్వామిని గురించి తెలుసుకో' కార్యక్రమంలో ఒక దృశ్యం

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 21 సంచిక 10




సంపాదకీయం

## తొలకరి !

**వా**నాకాలం వచ్చేసింది. మళ్ళీ వ్యవసాయ పనుల సందడి మొదలవుతున్నది. ఇప్పటికే చాలాచోట్ల వేసవి దుక్కులు చేసుకుని, తొలకరి వానలు పడగానే పంటలువేయడానికి రైతులంతా సిద్ధంగా వున్నారు. సహజంగానే అటు రైతులు, ఎఫ్ పి ఓల వంటి రైతు సంస్థలు, యిటు ప్రభుత్వాలు ఈ తొలకరి తరుణానికి ఎంతో ప్రాధాన్యం యిచ్చి, తగిన ముందస్తు వ్యూహాలను యిప్పటికే సిద్ధపరచుకుని వుంటారు. అయితే, ఆ వ్యూహాల సాధ్యాసాధ్యాలను, సానుకూల ప్రతికూలాలను మరొక్కమారు సమీక్షించుకుని ముందడుగువేయడం అవసరం. ఈ ఏడాది సాధారణ వర్షపాతమే వుంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అంచనాను దృష్టిలో వుంచుకుని పండించే పంటలను ఎంపికచేసుకోవడం మంచిది. సరే, భూసార పరీక్షలు జరిపి, అనువైన పంటలేవో ఆలోచించుకునే వుంటారు. వేయదలచుకున్న ఈ పంటలలో అంచనావేస్తున్న వర్షపాతం స్థాయినిబట్టి అవసరమైన మార్పుచేర్పులను పరిశీలించాలి. మరో ముఖ్యమైన విషయం పంటమార్పిడి. సంప్రదాయ పంటలను, ఈ సీజన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వేస్తున్న పంటలనే కాకుండా ఈ సారైనా యితర పంటలు వెయవచ్చునేమో రైతులు, ఎఫ్ పి ఓలు ఆలోచించాలి. ఆచరణ సాధ్యమైన కొత్తపంటలను వేటినైనా ఈసారి ప్రయోగాత్మకంగానైనా వేయవచ్చునేమో ఎందుకు ఆలోచించకూడదు? ఇంతేకాకుండా, వ్యవసాయ అధికారులు చేసే సూచనలను గురించికూడా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఉదాహరణకు తెలంగాణాలోని నాగర్‌కర్నూలు జిల్లాలో ఈ వానాకాలంలో నూనెగింజలు, పప్పుధాన్యాలు సాగుచేస్తే బాగుంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులేమో మూకుమ్మడిగా పత్తిపంట వేయాలని చూస్తున్నారు. సగానికి పైగా ఒకే పంటను వేస్తే ఎదురయ్యే సాధకబాధకాల గురించి ఆలోచించాలి కదా! ఇంతకు ముందే అకాల వర్షాలతో ఆంధ్రప్రదేశ్‌లో అనేకచోట్ల పత్తిపంట దెబ్బతిన్న విషయంకూడా గమనించాలి. పైగా, ప్రపంచవ్యాప్తంగా ఎన్నెన్నో కొత్త వ్యవసాయ ఉత్పత్తులతో, ఉద్యాన, ఔషధ, తదితర పంటలతో వ్యవసాయ రంగం మహోత్సాహంగా కొత్తపుంతలు తొక్కుతుంటే, మనం మాత్రం ఎప్పటికీ పాతపాటే పాడుకుంటామనడం ఏం సబబు? నిన్న మొన్నటిదాకా మన రైతులకు పేర్లుకూడా తెలియని ఎన్నో పైర్లు యిప్పుడిప్పుడు మన పొలాలలో కనిపిస్తున్నాయి. డ్రాగన్, లిచీ వంటి పండ్ల సాగు ఆకట్టుకుంటున్నది. ఇవి మన ప్రాంతాలకు అంతగా పరిచయం కాని పంటలు కావడం, కొన్ని ప్రాంతాలలోనే, కొద్ది విస్తీర్ణంలోనే వేస్తుండడంతో ధర, గిరాకీ బాగుంటున్నాయి. ఇలాగే , మన పొలాలకు అనుకూలమైన ఎన్నో కొత్త పంటలు వున్నాయి. కావలసింది తెలుసుకోవాలనే ఆసక్తి. అ ఆసక్తి వుంటే అవకాశాలు అపారంగా వున్నాయి, వుంటాయి. ముందుగా చక్కగా ఆలోచించి, ఏ పంట వేయాలో నిర్ణయించుకుంటే, ఇక విత్తనాలను, ఎరువులను, క్రిమిసంహారకాలను, అవసరమైన యితర మౌలిక వనరులను సమకూర్చుకోవడంపై శ్రద్ధ వహించవచ్చు. నిన్నటి సీజన్‌లో అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు తగిన మార్గదర్శనంచేసే బాధ్యతను ఎఫ్ పి ఓలు స్వీకరించాలి. సభ్య రైతులు వ్యవసాయంలో సత్ఫలితాలు సాధించి, మంచి లాభాలు ఆర్జించేలా చూడడం ఎఫ్ పి ఓల ప్రథమ కర్తవ్యం. ఎన్నో శిక్షణలు పొందుతున్నారు, మరెన్నో అవగాహన పర్యటనలు చేస్తున్నారు. ఆ అనుభవాలు, నేర్చుకున్న విషయాలు అవసరానికి మనకు ఉపయోగపడాలి కదా! సరైన పంట నిర్ణయం నుంచి, విత్తనాలు వేసి, పంటను కోసి మార్కెటింగ్ చేసేవరకు ఎఫ్ పి ఓలు నిరంతరం రైతుకు బాసటగా నిలవాలి. అప్పుడే ఈ సంఘటిత వ్యవసాయ వ్యవస్థపై రైతులకు నమ్మకం కుదురుతుంది. ఆ నమ్మకం మిగిలిన రైతులను కూడా ఎఫ్ పి ఓలుగా ఏర్పడడానికి ప్రోత్సహిస్తుంది. ఈ సీజన్‌లో వర్తించే ప్రభుత్వ రైతు సంక్షేమ, సహకార పథకాలను, పంటల బీమా వంటి సదుపాయాలను గురించి కూడా ముందే రైతులకు అవగాహన కల్పించడం అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓలను తగిన విధంగా ప్రోత్సహించే విషయంలో శ్రద్ధ చూపాలి. ఎఫ్ పి ఓలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో (ప్యాక్స్‌తో) సమానంగా చూడాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనను రాష్ట్ర ప్రభుత్వాలు పాటిస్తే ఎఫ్ పి ఓలకు ఎంతో మేలు జరుగుతుంది.


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy


**అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ చిత్తూరు రైతు సంస్థల ద్వార మామిడికాయలు ...05
➪ ఆదర్శ సమాఖ్యలపై ఏపిమాస్‌చే శిక్షణ ...06
➪ ఆంధ్రప్రదేశ్ 'దిశ' సభ్యుడుగా శ్రీ సి ఎస్ రెడ్డి ...07
➪ బీహార్‌లో ఎఫ్ పి ఓల భవితవ్యానికి ప్రణాళిక ! ...08
➪ పాలకోవాలో మేటి, సోలార్ డ్రయ్యర్లలో మిన్న ...10
➪ కుప్పకూలిన బంగినపల్లి ధర ... కుంగిన రైతు! ...12
➪ విప్రో భాగస్వామ్య పరిచయ సమావేశం! ...13
➪ పుట్టపర్తి జిల్లాలో చిరుధాన్యాల మహోత్సవం! ...14
➪ గుత్తి ప్రాజెక్ట్‌లో సాధనలు, సమస్యలు ! ...16
➪ సెర్ప్ ప్రగతి ప్రస్థానం..ఎస్‌హెచ్‌జిల జయకేతనం...18
➪ బీహార్ ఎఫ్.పి.ఓల సిబ్బందికి శిక్షణ ...22
➪ ఆవు పెరుగు వుంటే యూరియాతో పనిలేదు ...23
➪ పట్టు' సాగుపట్ల రైతుల్లో తగ్గుతున్న ఆసక్తి ! ...24
➪ అకాల వర్షాలతో పత్తి రైతు కుదేలు ! ...25
➪ సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు...26
➪ విశాఖలో మహిళలకు పారిశ్రామిక శిక్షణ ...27
➪ పంటల మార్పిడితో రైతులకు అవగాహన ! ...28
➪ ఖరీఫ్ పెసర రకాలు ... సాగులో మెళకువలు ...30
➪ క్యూఆర్ కోడ్‌తో నకిలీ విత్తనాలకు చెక్ ...32
➪ అరటి రైతుల లిచీ పండ్ల సాగు ...! ...33
➪ తెలంగాణాలో పెరగనున్న పత్తి సాగు ! ...34

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఈరోజును వ్యర్థపరచుకునేవాడికి రేపటిరోజు మంచిదెలా అవుతుంది?

# చిత్తూరు జిల్లాలో 5 వేల టన్నుల మామిడికాయల మార్కెటింగ్!

– ఎన్. వినాయక రెడ్డి

**ఉ**మ్మడి చిత్తూరు జిల్లా మామిడి సాగుకు ప్రసిద్ధి గాంచినది. ఇక్కడ పండిన పండ్లను మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఏపిమాస్, భారత ప్రభుత్వం, ఉద్యానశాఖ, నాబార్డు మొదలగు సంస్థలు గత 6 సంవత్సరములుగా చిత్తూరు జిల్లాలోని మామిడి, టమాట ఇతర కూరగాయలు పండించే రైతులను కలిపి, వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, రైతుల ఆదాయము రెండింతలు చేసుకోవాలనే ముఖ్య ఉద్దేశముతో సుమారు 75 ఎఫ్ పి ఓ లను (రైతు ఉత్పత్తిదారుల సంస్థలను) ఏర్పాటు చేసినవి. ప్రతి ఎఫ్ పి ఓ లో 300 నుండి 2000 వరకు రైతులు వాటాదారులుగా ఉన్నారు. ఈ సంఘాలు ప్రస్తుతం ఎక్కువగా పంటల ఉత్పత్తికి కావలసిన అవసరాలను ఉమ్మడిగా కొనుగోలుచేసి తక్కువ ధరకు సభ్య రైతులకు అందిస్తున్నాయి.

రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే రైతు ఉత్పత్తిదారుల సంస్థలు వ్యాపార సంస్థలుగా మారి, సభ్య రైతులు పండించే పంటలను ఉమ్మడిగా మార్కెటింగ్ చేయాలనీ, దానికి తగిన సౌకర్యాలను తాము కల్పిస్తామని పైన తెలిపిన ప్రోత్సాహక సంస్థలు మరియు ప్రభుత్వం శాఖల ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు అవగాహన కల్పించడముతో పాటు, వీటికి కొనుగోలు సంస్థలతో (ఐటిసి, లీఫ్, బిగ్‌బాస్కెట్, స్విగ్గి మొదలగు సంస్థలతో) అనుసంధానము చేసినది.

పలమనేరు, పీలేరు, వి.కోట, సోమల, కలికిరి రామచంద్రాపురం బి.కొత్తకోట పిటిఎం మొదలగు మండలాలలో కొన్ని ఎఫ్ పి ఓ లు, ఉద్యాన శాఖ, ఏ పీ ఎల్ ఐ పి , ఆపరేషన్ గ్రీన్స్ ద్వారా, పండ్లు కూరగాయల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. వీటి ద్వారా ఈ సంవత్సరం వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించాయి. ఎఫ్‌పీఓలు వారి వ్యాపారమునకు కావలసిన పెట్టుబడులను



కొంతవరకు, ఏపీమాస్, నాబార్డు ఉద్యానశాఖ, సిఎస్ఎస్ స్కీము , బ్యాంకుల ద్వారా సమకూర్చుకున్నాయి.

ఎఫ్ పి ఓలు సభ్య రైతుల తోటలను సందర్శించి, మామిడి పంటల రకాలను, దిగుబడిని అంచనా వేశాయి. ఏ వారంలో పంట కోతకు వచ్చునో రైతులతో కలసి అంచనా వేశాయి. సుమారుగా 5000 టన్నుల మామిడికాయలను వ్యాపారము చేయవచ్చని నిర్ణయించుకున్నాయి. ఈ వివరాలను కొనుగోలు సంస్థలతో (ఐటిసి, లీఫ్, బిగ్‌బాస్కెట్, స్విగ్గి మొదలగు సంస్థలతో) చర్చించి, కొన్ని నియమ నిబంధనావళిని ఏర్పాటు చేసుకుని, వారికి సరఫరా చేయుటకు ఒప్పందం చేసుకున్నాయి.

మే నెల 2వ తేది నుండి మార్కెటింగ్ ప్రారంభించాలని నిర్ణయించుకుని, మామిడికాయలను కోయడం, నాణ్యతను పరిశీలించడం, గ్రేడింగ్ చేయడం, ప్యాకింగు చేయడం, లోడింగ్ చేయడం గురించి రైతులకు, బిఓడి కి , సిబ్బందికి కొనుగోలుదారులకు శిక్షణలు యివ్వడం జరిగింది.

ఇప్పటివరకు గత పది రోజులుగా 25 లక్షల విలువ గల 100 టన్నుల బేనిష, తోతాపురి కాయలు కొనుగోలుదారులకు పంపించడము జరిగినది. రాబోవు 2 నెలల కాలములో 5000 టన్నులు మార్కెటింగ్ చేయాలనే లక్ష్యంతో ఎఫ్ పి ఓలు ముందుకు వెళుతున్నాయి. వారి లక్ష్యం నెరవేరి రైతుల ఆదాయము రెండింతలు కావాలని ఆశిద్దాం, మన వంతు సహకారం అందిద్దాం. ■

# ఆదర్శ సమాఖ్యలపై ఏపిమాస్‌చే జాతీయస్థాయి శిక్షణ

- జి.శ్రీనివాస్



**జా**తీయస్థాయి ఆదర్శ స్వయం సహాయ సంఘాల సమాఖ్యలకు ఏపిమాస్ ఆధ్వర్యంలో 16-05-2023 నుండి 20-05-2023 వరకు ఐదురోజుల పాటు హైదరాబాదులోని ఏపిమాస్ శిక్షణ కేంద్రంలో డి.జి.ఆర్.వి ఆర్థిక సహకారంతో శిక్షణ నిర్వహించాము. ఈ శిక్షణకు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన ఎనిమిది స్వచ్ఛంద సంస్థల నుండి 21 మంది అభ్యాసకులు పాల్గొన్నారు. ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగు రోజులపాటు శిక్షణ , ఒక రోజు కామారెడ్డి జిల్లాలో క్షేత్ర సందర్శన నిర్వహించాము.

శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి.యస్.రెడ్డి భారతదేశంలోని మహిళా సంఘాల, సమాఖ్యల స్థితి గతులను గురించి, సమాఖ్యల విజన్ 2030 గురించి వివరించారు. సమాఖ్యల విజన్ 2030లో సమాఖ్యలను ఏర్పాటు చేస్తున్న సంస్థల పాత్ర ఏవిధంగా ఉండాలో చర్చించారు.

శ్రీ యన్.మధుమూర్తి ఏపిమాస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అభ్యాసకుల ద్వారా వారి అనుభవాలను, వారి సంస్థలలో సంఘాల, సమాఖ్యల కోసం చేస్తున్న కార్యక్రమాలను చెప్పించారు.

శ్రీమతి రామలక్ష్మి సమాఖ్య అంటే ఏమిటి ? రాష్ట్ర, దేశ స్థాయిలోని వివిధ రకాల సమాఖ్యల గురించి చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సంఘాల సమాఖ్యల ఏర్పాటు విధానం తెలియపరచారు. సమాఖ్యల సమావేశ నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. సంఘాలు, సమాఖ్యలు పాటించాల్సిన సహకార సూత్రాలు, పద్ధతులు, సహకార విలువల గురించి వివరించారు.

మొదటి రోజు జరిగిన అంశాల పునశ్చరణ జరిగింది. తదుపరి సమాఖ్యల నిర్మాణం, నిర్వహణ విధానం, మహాసభ, పాలకవర్గం, పదాధికారుల బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఆదర్శ సమాఖ్యల గురించి వివరించి, ఆదర్శ సమాఖ్య కోసం ఏవిధంగా పని చేయాలో తెలియచేయటం జరిగింది. వాష్ కార్యక్రమం అమలు, స్వయం నియంత్రణ ఉద్యమం అమలు, కార్యక్రమాల గురించి వివరించటం జరిగింది.

నాయకత్వం బాధ్యతలను, ఎన్నికలు నిర్వహించే విధానం, శ్రీనిధి కో-ఆపరేటివ్ బ్యాంకు కార్యక్రమాలను తెలియపరిచాము. మహిళా ఎంటర్ ప్రైజెస్ గురించి శ్రీ వెంకన్న వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం కామారెడ్డి జిల్లా, దోమకొండ మండలంలోని సంఘాల,



గ్రామ సంఘాల, మండల సమాఖ్య సభ్యులు, ప్రతినిధులతో సమావేశమై సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై అభ్యాసకులు నేరుగా సభ్యులతో మాట్లాడి కొత్త విషయాలు తెలుసుకున్నారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారితో, వారి సిబ్బందితో సమావేశం జరిగింది.

అనంతరం అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై చర్చించి వారి సందేహాలను నివృత్తి చేయటం జరిగింది. జీవనోపాధి కార్యక్రమాల విధి విధానాలు, సంఘాలలో అమలు గురించి తెలియపరచి, వారిచే చక్కని ప్రణాళిక తయారు చేయించటం జరిగింది.




ఈ విధంగా ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణలో అభ్యాసకులు మాట్లాడుతూ ఈ శిక్షణ విధానం, ఎంతో బాగున్నదని, శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెల్పినారు. చివరగా శిక్షణలో పాల్గొన్న వారి ఫీడ్ బ్యాక్, శిక్షణ పూర్వ పరీక్షా పత్రం వ్రాయించి వారికి సర్టిఫికేట్లు యివ్వడంతో శిక్షణ ముగిసింది. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్‌లుగా ఏపిమాస్ నుంచి శ్రీ సి.యస్ రెడ్డి, శ్రీ యన్. మధుమూర్తి, శ్రీమతి యస్. రామలక్ష్మి, శ్రీ మురళి జాజున, శ్రీ వేద్‌ప్రకాష్ సింగ్, శ్రీ కరి శ్రీనివాస్, శ్రీమతి భవాని, శిక్షణ కో–ఆర్డినేటర్లు శ్రీ జి శ్రీనివాస్ , శ్రీ మహేష్ అలగప్ప, శ్రీనిధి కో–ఆపరేటివ్ బ్యాంకు నుండి శ్రీ బి.వి.యస్ రెడ్డి పాల్గొని వివిధ అంశాలపై అభ్యాసకులకు వివరించారు.

■

## ఆంధ్రప్రదేశ్ ' దిశ ' రాష్ట్రస్థాయి కమిటి సభ్యుడుగా శ్రీ సి ఎస్ రెడ్డి

**కేం**ద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాలలో అమలుజరిగే భారీ ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణకోసం జిల్లా స్థాయిలో 'దిశ ' (జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ) కమిటీలను గతంలో ఏర్పాటుచేశారు. అయితే, ఈ జిల్లా స్థాయి 'దిశ ' వ్యవహారాలను రాష్ట్రస్థాయిలో పర్యవేక్షించడం కోసం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి 'దిశ' కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధిమంత్రిత్వ శాఖ వ్యవహారాలను పర్యవేక్షించే ఉపముఖ్యమంత్రి సహ అధ్యక్షులుగా, పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్య కార్యదర్శి గా ఈ కమిటి ఏర్పాటైంది. ఆరుగురు పార్లమెంట్ సభ్యులు, ఆరుగురు, ఎం ఎల్ ఏలు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధిపతులు, మొదలైనవారు ఈ కమిటి సభ్యులుగా వుంటారు. వీరితోపాటు రాష్ట్రానికి చెందిన రెండు ఎన్ జి ఓల ప్రతినిధులను కూడా ఈ కమిటీలో సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ కోవలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఈ కమిటీ సభ్యులుగా నియమితులైనారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్ ఈ కమిటీ నియామక ఉత్తర్వులను జారీచేశారు. జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో గతంలో ఏర్పాటైన 'విజిలెన్స్, అండ్ మానిటరింగ్' కమిటీల స్థానంలో ఈ దిశ కమిటీలు ఏర్పాటయ్యాయి. కేంద్రప్రభుత్వం అమలుచేసే వివిధ పథకాలు నాణ్యంగా, నిధుల వ్యయం పారదర్శకంగా జరిగేలా చూడడం ఈ కమిటీల ప్రధాన లక్ష్యం. జారీచేసిన నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టుల నిర్వహణ జరిగేలా చూడడం, అమలుచేసే వివిధ పథకాల మధ్య సమన్వయం వుండేలా చూడడం, ఈ పనుల నిర్వహణను సమీక్షించడంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు తగిన కీలక పాత్ర వుండేలా చూడడం ఈ రాష్ట్రస్థాయి దిశ కమిటీ యితర లక్ష్యాలు.

పరాజయానికి కారణం శక్తిహీనతో, అజ్ఞానమో కాదు; సంకల్ప లోపమే అసలు కారణం

# బీహార్‌లో ఎఫ్ పి ఓల ఉజ్వల భవితవ్యానికి ప్రణాళిక !

## పాట్నాలో ఏపిమాస్, బి ఆర్ ఎల్ పి ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓల రాష్ట్రస్థాయి సమ్మేళనం

**బీ**హార్ రాజధాని పాట్నాలో ఆ రాష్ట్ర ఎఫ్ పి ఓల రాష్ట్రస్థాయి సమ్మేళనం 2023 మే 10 వ తేదీన ఉత్సాహంగా జరిగింది. ఈ సమ్మేళనాన్ని 'జీవిక'గా వ్యవహరించే 'బీహార్ గ్రామీణ జీవనోపాధుల ప్రోత్సాహక సంఘం (బి ఆర్ ఎల్ పి ఎస్)' , ఏపిమాస్ సంయుక్తంగా నిర్వహించాయి. బి ఆర్ ఎల్ పి ఎస్ , నాబార్డ్ , ఎన్ సి డి సి, ఎఫ్ డి ఆర్ వి సి, వివిధ సి బి బి ఓ లనుంచి వందమందికి పైగా ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. బి ఆర్ ఎల్ పి ఎస్ నుంచి పాల్గొన్నవారిలో 26జిల్లాల ప్రాజెక్ట్ మేనేజర్లు (డి పి ఎంలు), ఎఫ్ పి ఓల సి ఇ ఓలు, పలువురు ఇతర ప్రతినిధులు వున్నారు. ఏపిమాస్ నుంచి ఆ సంస్థ బీహార్ ప్రాజెక్ట్ మేనేజర్లు, ఎఫ్ పి ఓల సి ఇ ఓలు పాల్గొన్నారు. ఇంతేకాకుండా, హైదరాబాద్‌లోని ఏపిమాస్ప్రధాన కార్యాలయం నుంచి ఆ సంస్థ ఎండి, ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ సి ఎస్ రెడ్డి బి ఆర్ ఎల్ పి ఎస్ సి ఇ ఓ ప్రత్యేక ఆహ్వానంపై ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

బీహార్‌లోని ఎఫ్ పి ఓల తీరుతెన్నుల గురించి వివిధ ప్రధాన భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ప్రెజెంటేషన్స్ చేశారు. ఇంతేకాకుండా, బీహార్ ఎఫ్ పి ఓల స్థితిగతులపై మధ్యప్రదేశ్‌కు చెందిన 'మధ్యభారత్ ఎఫ్ పి ఓల కన్సార్టియం' ప్రతినిధి శ్రీ యోగేష్ ద్వివేది చేసిన సమగ్రమైన ప్రెజెంటేషన్ ఆకట్టుకున్నది.

భాగస్వామ్యప్రతినిధుల ప్రెజెంటేషన్స్‌తోపాటు, కీలకాంశాలపై నాలుగు చిన్న బృందాల చర్చాగోష్ఠులు జరిగాయి. ఈ చర్చలు తాము సమైక్యంగా పనిచేయాలని, ఎఫ్ పి ఓలు వ్యాపార సంస్థలుగా ఎదిగేలా చూడాలని, తద్వారా చిన్న రైతుల రాబడి పెరగడానికి తమవంతు పాటుపడాలన్న సభ్యుల ఆకాంక్షను చాటాయి. నిర్వహణ సామర్థ్యం, మూలధనం, మార్కెట్లతో అనుసంధానం, తమ సమస్యలను, అనుభవాలను పంచుకోడానికి, కొత్త విషయాలు నేర్చుకోడానికి ఒక వేదిక ఆవశ్యకత వంటి అంశాలను దృష్టిలో వుంచుకుని భాగస్వాములందరూ తాము సంఘటితంగా పనిచేయడం అత్యవసరమని గుర్తించారు.

ఈ ఉమ్మడి కృషికి నాందిగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల ఉన్నతాధికారులు తమ క్షే త్రస్థాయి సిబ్బందికి ఎఫ్ పి ఓలకు అవసరమైన తోడ్పాటు అందించేలా ఉత్తర్వులు జారీచేయాలని, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటి (ఎస్ ఎల్ బి సి) కూడా జిల్లా, బ్లాక్ స్థాయి బ్యాంకుల అధికారులు ఎఫ్ పి ఓలకు తగిన రుణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ సమ్మేళనం గట్టి అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. కనీస మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తులను సేకరించే అవకాశాన్ని , చట్టబద్ధమైన అధికారాన్ని ఎఫ్ పి ఓలకు కల్పిస్తూ, పాక్స్/ సహకార సంస్థలతో వాటికి సమాన ప్రతిపత్తి కలిగిస్తూ, విత్తనాలు, ఎరువుల వంటి వ్యవసాయ పెట్టుబడులను సమకూరుస్తూ, బీహార్ ప్రభుత్వం ఎఫ్ పి ఓల భాగస్వామిగా వ్యవహరించాలనికూడా సమ్మేళనం గట్టిగా కోరింది. దీనితోపాటు పరస్పరం సంపూరక, పరిపూరక పాత్ర నిర్వహించగలిగే అనుబంధం దృష్ట్యా, రాష్ట్రంలోని ఎస్ హెచ్ జి సమాఖ్యలకు, ఎఫ్ పి ఓలకు మధ్య అవినాభావ సంబంధం బలపడాలని, ఎఫ్ పి ఓలు, వాటి సమాఖ్యల నాయకత్వంలో, విలువ గొలుసును పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలని, వ్యాపార నిర్వహణ కార్యకలాపాలలో మహిళలకు అధిక ప్రాధాన్యం యివ్వాలని సమ్మేళనం దృఢంగా అభిప్రాయపడింది.

ఎఫ్ పి ఓలను కృషి విజ్ఞాన కేంద్రాలతో (కే వి కే లతో), పరిశోధక సంస్థలతో, విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేయాలని, ప్రస్తుతం అమలు జరుగుతున్న పి ఎం ఎఫ్ ఎం ఇ, ఆర్ కె వి వై, ఎం ఐ డి హెచ్, ఏఐఎఫ్ వంటి పథకాల కింద ఎఫ్ పి ఓలకు మౌలిక వనరులను

ఓడిపోతానేమోననే భయం నిన్ను విజయ తీరానికి చేరుస్తుంది



సమకూర్చుకోవడంకోసం 75% వరకు సబ్సిడీతో ఆర్ధిక సహకారం అందించాలని ఈ సమ్మేళనం ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది.

ఎఫ్ పి ఓలు గొప్ప వ్యాపార సంస్థలుగా ఎదగడానికి దోహదంచేసే విధంగా రాష్ట్రస్థాయిలో సానుకూల విధాన ప్రణాళిక ఒకటి రూపొందాలన్న అభిప్రాయాన్ని బి ఆర్ ఎల్ పి ఎస్ సి ఇ ఓ శ్రీ రాహుల్ కుమార్, బీహార్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ అలోక్ రంజన్ ఘోష్ వ్యక్తంచేశారు. ఇందుకోసం త్వరలో ఒక కార్యాచరణబృందాన్ని ఏర్పాటు చేయాలని సమ్మేళనం సంకల్పించింది.

ఈ సమావేశంలో ఇంకా నాబార్డ్ పాట్నా ప్రాంతీయ కార్యాలయం నుంచి శ్రీ సుమిత్, సి బి బి ఓ లు ప్రదాన్, మైక్రోసేవ్, డిజిటల్ గ్రీన్, ఎఫ్ డి ఆర్ వి సి, ఎం బి సి ఎఫ్ పి సి ప్రతినిధులు పాల్గొన్నారు. వీరు తమ సంస్థలు ఎఫ& పి ఓల విషయంలో పాటిస్తున్న ఉత్తమ విధానాలను, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎఫ్ పి ఓలు సుస్థిరాభివృద్ధితో ముందడుగు వేయడానికి ఇటి బీహార్ ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వము తగిన విధాన పరమైన నిర్ణయాలతో తోడ్పాటు అందించాలని కోరారు. జీవిక ఎఫ్ పి ఓలు ఎదుర్కొంటున్న సమస్యల, సవాళ్ళ పరిష్కారంలో చూపతున్న సాచివేత ధోరణిపట్ల బి ఆర్ ఎల్ పి ఎస్ సి ఇ ఓ ఆవేదన వ్యక్తంచేశారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వ్యవసాయ శాఖ డైరెక్టర్ చెప్పారు.

శ్రీ సి ఎస్ రెడ్డి ఈ సదస్సులో ప్రధాన ప్రసంగంచేస్తూ, ఎఫ్ పి ఓ ల జాతీయ, అంతర్జాతీయ తీరుతెన్నులను విశ్లేషించారు. సహకార వ్యవస్థ శిఖరాగ్ర విజయాన్ని అందుకున్న జర్మనీ సహకార రంగం స్వభావ, ప్రస్థానాలను ఆయన వివరించారు. ■

## జనగాం రైతు వికాస సమాఖ్యచే వాహనం కొనుగోలు

– జి. శ్రీనివాస్

**జ**నగాం జిల్లాలో ఏపిమాస్, మారి సంస్థ జర్మనీకి చెందిన డి.జి.ఆర్.వి జస్టి సంస్థ ఆర్థిక సహకారంతో పదమూడు రైతు ఉత్పత్తి కంపెనీలను కలిపి జిల్లా స్థాయిలో 'రైతు వికాస సమాఖ్య' పేరిట ఒక సమాఖ్య ఏర్పాటైంది. ఈ సమాఖ్యను కంపెనీ చట్టం క్రింద రిజిస్ట్రేషన్ చేసి, లైసెన్సులు తీసుకొని ఇన్పుట్ షాప్ కూడా ఏర్పాటు చేసుకొని సభ్య ఎఫ్ పి ఓలు, ఎఫ్ పి సి లకు కావాల్సిన వ్యవసాయ మౌలిక వనరులను సరఫరా చేస్తున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు వ్యాపార కార్యక్రమాలు కూడా ఈ సంవత్సరం మొదలుపెట్టారు.




రైతు వికాస సమాఖ్య కార్యక్రమాలను మరింత ముమ్మరంగా నిర్వహించడం కోసం ఒక వాహనం కొనుగోలు చేయాలని సమాఖ్య వారు నిర్ణయించారు. 5 టన్నుల కెపాసిటి కలిగిన ఆరుటైర్ల వాహనం ఖరీదు రూ.14,50,000/– అంచనా వేయగా, జర్మనీకి చెందిన డి.జి.ఆర్.వి జస్టి సంస్థవారు రూ. 8 లక్షల రూపాయలను గ్రాంట్ రూపంలో ఇచ్చారు. మిగిలిన ఆరు లక్షల యాభై వేల రూపాయలు జనగాంలోని హెచ్.డి.యఫ్.సి బ్యాంకులో అప్పుగా తీసుకొని ఐదు టన్నుల వాహనం కొనుగోలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి శ్రీ యన్.మధుమూర్తి, శ్రీ జి. శ్రీనివాస్, మారి సంస్థ సిబ్బంది శ్రీ వెంకట్, శ్రీ నర్సింగం, శ్రీ యాదగిరి, సమాఖ్య పాలకవర్గ సభ్యులు, పదాధికారులు శ్రీ బాబురావ్ నాయక్, శ్రీ శ్రీనివాస్, శ్రీమతి శ్రీలత పాల్గొన్నారు. ■

# పాలకోవాలో మేటి, సోలార్ డ్రయ్యర్లలో మిన్న !

## గృహ పరిశ్రమలతో గ్రామస్తుల కల్పవల్లిగా ఎదిగిన తడకనపల్లి !!

– జి. గంగాద్రి

*కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, తడకనపల్లి గ్రామం ... ఈ ఊరి పేరు అందరికీ నోరూరిస్తుంది ! కారణం, ఈ ఊళ్ళో తయారయ్యే పాలకోవా ! ఆ పాలకోవాకు అంతటి ఆదరణ! మరో విధంగా కూడా ఈ ఊరు గుర్తింపు పొందింది. ఈ చిన్న గ్రామంలో ఉల్లిపాయలను, టమాటాలను ప్రాసెసింగ్ చేసే గృహ పరిశ్రమలు దాదాపు 25 వున్నాయి! ప్రాసెసింగ్ అంటే తగిన పరిమాణంలో ముక్కలుగా కత్తిరించి, ఎండబెట్టి, ఆహార పదార్థాల పరిశ్రమలకు సరఫరా చేస్తారు. ఈ గ్రామాన్ని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్, సహకార, ఆహార పదార్థాల ప్రాసెసింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ చిరంజీవి చౌదరి, ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు సందర్శించి గ్రామంలోని పారిశ్రామికాభివృద్ధిని పరిశీలించారు. అనంతరం కర్నూలులో శ్రీ చిరంజీవి చౌదరి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు, గ్రామాలలో పారిశ్రామిక, వ్యాపార సంస్థల ఏర్పాటును ప్రోత్సహించే కార్యక్రమాల వివిధ భాగస్వాములతో జరిగిన సమావేశంలో కర్నూలు జిల్లాలో ఉల్లిపాయలను, టమాటాలను ప్రాసెసింగ్ చేసే గృహ పరిశ్రమల ఏర్పాటులో 3,000 మంది మహిళలను ప్రోత్సహించాలన్న ప్రణాళిక వున్నట్టు వెల్లడైంది. ఎఫ్ పి ఓలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో యిప్పటికే మంచి గ్రామీణ పారిశ్రామిక వాటికగా ఎదిగిన తడకనపల్లి గ్రామ మహిళల పారిశ్రామిక ప్రస్థానాన్ని గురించి తెలుసుకుందాం ....*

---

**త**డకనపల్లి గ్రామంలో మొట్టమొదటిసారి 1980 దశకంలో పాలకోవా తయారీ శ్రీ షేక్ శాలి సాహెబ్‌తో ప్రారంభమైంది. షేక్ శాలి సాహెబ్ మధ్యతరగతి రైతు. తన పొలం పనులతో పాటు, గేదెలను పెంచి జీవనం సాగించేవారు. తన గేదెలు ఇచ్చే పాలను అమ్మడానికి దగ్గరిలో వున్న పట్టణం కర్నూలు 15 కిలోమీటర్లు దూరంలో ఉన్నందున, పాలను అమ్మే సదుపాయాలు అందుబాటులో లేక పాలను కోవగా తయారుచేసి అమ్మడం ప్రారంభించాడు.

**ప్రభుత్వ ప్రోత్సాహం**

2004 సంవత్సరంలో డిఆర్‌డిఏ, జిల్లా జీవనోపాధుల కేంద్రం శాంతి –1 స్వయం సహాయ సంఘానికి గ్రామ సంఘంనుండి రుణం యిప్పించి కోవా తయారుచేయడానికి తోడ్పాటు అందించారు. అయితే సంఘంలోని సభ్యులందరూ ఆ కార్యక్రమాన్ని కొనసాగించలేకపోయారు. శ్రీమతి షేక్ జుబేదా బేగమ్ సంఘంలో చురుకైన సభ్యురాలే కాక గ్రామ సంఘంలోను లీడర్ గా ఉండేది. ఆమె మాత్రం తన కుటుంబ పోషణకు కోవా తయారీని ముఖ్యమైన ఆదాయ వనరుగా ంచుకొని యిప్పటికీ కొనసాగిస్తున్నది .

**కోవా తయారీ దశలు**

**1) సాధారణ తయారీ విధానం:** వీరు మొదట సాధారణ విధానంలో (యంత్రాలు లేకుండా) తయారుచేశారు. అప్పుడు ఒక్కొక్కరు 5–10 కేజీలు మాత్రమే తయారు చేయగలిగే వారు.



**2) యాంత్రీకరణ విధానం :** ప్రధానమంత్రి ఫుడ్ ప్రోసెసింగ్



పథకం (పి ఎం ఎఫ్ ఎం ఇ)లో భాగంగా ఒక్కో యూనిట్‌కు 3,30,000 రూపాయల రుణము మంజూరు చేశారు. ఇందులో సభ్యులు తమ వాటాగా 10,000 రూపాయలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని బ్యాంకులు రుణంగా సమకూరుస్తాయి. ఈ మొత్తంలో పిఎంఎఫ్ఎంఇ 35% రాయితి (సబ్సిడీ) అందిస్తుంది. ఈ యంత్రాలను ఉపయోగించి రోజుకు 200 లీటర్ల పాలతో కోవా తయారుచేస్తున్నారు.

**ముడిసరుకులు :** కోవా తయారీకి కావలసిన ముడి సరుకులు : 1)పాలు 2) చక్కెర లేదా బెల్లం 3) వంటచెరకు

**తయారయ్యే కోవా** : 20 లీటర్ల పాలు, 4 కేజీల చక్కెరతో 9 కేజీల కోవా తయారవుతుంది.

**ఆర్థిక అంశాలు :** పాలు లీటర్ : 50 రూపాయలు, చక్కెర కేజీ : 40 రూపాయలు, పొట్టు : 50 రూపాయలు. కూలీ : 40 రూపాయలు

ఒక విడత (ట్రిప్) కోవా తయారీకి : పాల ఖర్చు 20×50 = 1000, చక్కెర ఖర్చు 4×40 = 160, పొట్టు: 50 రూపాయలు, లేబర్ : 40 రూపాయలు

మొత్తం పెట్టుబడి : 1250 రూపాయలు

తయారయ్యే కోవా : 9 కేజీలు

1 కేజీ అమ్మకం ధర : 200 రూపాయలు

ఒక విడతకు రాబడి : 200×9 = 1800 రూపాయలు

రోజుకు 5 విడతలు (టిప్పులు) కోవా తయారీ

పెట్టుబడి 1250 × 5 = 6250

ఐదు విడతలకు రాబడి : 45 × 200 = 9000

రోజుకు లాభం = 9000–6250 = 2750

**20 కుటుంబాలు, 1300 కేజీల పాలకోవా**

గ్రామస్థాయిలో రోజుకు 20 కుటుంబాల వారు రోజుకు 3000 లీటర్ల పాలు ఉపయోగించి 1300 కేజీల పాలకోవా తయారు చేస్తారు . అంటే 1300 × 200 = 2,60,000 రూపాయల విలువైన కోవా తయారు చేస్తారు. గ్రామంలో 200 కుటుంబాలవారికి పాడి పశువులు ఉన్నాయి

**మార్కెట్ :** ముఖ్యంగా లోకల్ గ్రామస్థాయిలోనే యెక్కువ అమ్ముడుపోతాయి. ప్రతి యూనిట్ వారు షాపు గ్రామంలో దుకాణం ఏర్పాటుచేసుకుని అమ్ముకుంటారు. ఇంతేకాకుండా ఆర్డర్‌పై ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తారు. ఒక్కోసారి ఇతర గ్రామాల చిల్లర వ్యాపారులు వీరి వద్ద కొనుక్కుని తీసుకెళుతుంటారు.

**గుర్తింపు :** ముఖ్యంగా తడకనపల్లి పాలకోవాకు కర్నూలు జిల్లాలో మంచిపేరు వచ్చింది. ఈ కోవా తయారీదారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తారు. వీరు అందరూ ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్సు కలిగి ఉన్నారు. ఈ కారణంగా, డి ఆర్ డి ఏ వారు తమ ప్రత్యేక కార్యక్రమాల సందర్భాలలో తడకనపల్లి పాలకోవా వారికి స్టాలు కేటాయిస్తుండడంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పాలకోవాకు మంచి గుర్తింపు వచ్చింది.

ముఖ్యంగా జిల్లా స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్లు శ్రీ సాయి ప్రసాద్ , శ్రీ విజయ మోహన్ వీరికి మంచి తోడ్పాటు అందించారు. ఇప్పటి కలెక్టర్ శ్రీమతి సృజనా చౌదరి తడకనపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

**25 సోలార్ డ్రయ్యింగ్ యూనిట్లు !**


తడకనపల్లి మహిళలు పాలకోవా తయారీలోనే కాకుండా, ఉల్లిపాయలు, టమోటాల ప్రాసెసింగ్‌లో కూడా మంచి నైపుణ్యం చూపిస్తున్నారు.ఇప్పటికే ఈ గ్రామంలో 25 సోలార్ డ్రయ్యింగ్ యూనిట్లు వున్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. కేంద్రప్రభుత్వ పి ఎం ఎఫ్ ఎం ఇ పథకంకింద ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటి (ఏ పి ఎఫ్ పి ఎస్ ) ఈ సోలార్ డ్రయ్యర్లను సమకూరుస్తుంది. ఏపిఎఫ్‌పిఎస్ తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కొక్కటి 1,00,000 రూపాయల విలువైన సోలార్ డ్రయ్యింగ్ యూనిట్లను

**(మిగతా 15వ పేజీలో)**

# కుప్పకూలిన బంగినపల్లి ధర ... కుంగిన రైతు!

**మా**మిడికాయల్లో రారాజు అయిన బంగినపల్లి మామిడి ఈ ఏడాది రైతులను నిండా ముంచింది. తొలి కాపులో టన్ను రూ.60 వేలు దాకా పలికిన పంట ఇప్పుడు రూ.15 వేలకు మించి ధర ఉండటం లేదు. రెండో కాపులో మంగు, పురుగు ఎక్కువగా ఉండటంతో ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టిన రైతులు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో పండించే బంగినపల్లి మామిడి రకానికి తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి పేరుతో పాటు గిరాకీ ఉంది. ఈ ప్రాంతంలో పండిన మామిడి కాయలు విదేశాలకు సైతం



ఎగుమతి అయ్యేవి. ఐదేళ్లుగా బంగినపల్లి మామిడి పేరు మసక బారుతోంది. రెండో కాపులో పచ్చికాయలపై మంగు, పండుకాయల్లో పురుగులు ఉండటంతో ఢిల్లీ సేట్‌లు బంగినపల్లి  కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్నా సరైన ధర ఇవ్వడం లేదు.

సీజన్ ప్రారంభంలో టన్ను బంగినపల్లి మామిడి ధర రూ.50 వేల నుంచి రూ.60 వేలు పలికింది. వారం పదిరోజుల్లోనే ధర అమాంతం పడిపోయి టన్ను రూ.15 వేలకు చేరుకోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

**ఎకరాకు రూ.30 వేలు ఖర్చు**

బంగినపల్లికి పూత ప్రారంభం దశ నుంచి కాయ కోతకు వచ్చే వరకు రైతులు ఎకరానికి రూ.30 వేలు వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా మంగు సోకడంతో టన్ను రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు కమీషన్ దుకాణదారులు కొనుగోలు చేసి జ్యూస్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. మంగు వచ్చిన కాయ.. ధర పలకకపోవడంతో కొందరు రైతులు కాయల కోత ఆపేశారు. కోత కూలీ, రవాణా ఖర్చులు రావడం లేదని చెట్లకు వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పశువులకు కాయలు ఆహారంగా పెడుతున్నారు.

**ధరరాక నిరాశతో ఉచితంగా పంపిణీ**

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదరకు చెందిన రైతు బెక్కం రాజగోపాలరావుకు మామిడి తోట ఉంది. ఆయన




ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టి నాలుగెకరాల్లో మామిడి సాగు చేశారు.

14-05-23 నాడు నాలుగు టన్నుల బంగినపల్లి మామిడిని కోసి ఈదర మార్కెట్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వ్యాపారులు టన్నుకు రూ.6 వేలు ధర నిర్ణయించడంతో అంత తక్కువకు పంటను అమ్మేందుకు మనసు రాక ఓ ట్రాక్టరుపై తనకు పరిచయం ఉన్న వ్యక్తితో కలిసి మామిడి పండ్లను నూజివీడులో  ఉచితంగా పంపిణీ చేశాడు. గతంలో టన్ను మామిడి ధర రూ.30 వేల నుంచి 40 వేల వరకు ఉండేదని.. ఇప్పుడు ఆ ధర రూ.4 వేల నుంచి 12 వేలకు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశాడు.

■

వున్నదానితో ఆనందించలేనివారికి ఎంత వున్నా ఆనందం వుండదు

# విప్రో భాగస్వామ్య పరిచయ సమావేశం!

– వి. ప్రగతి



విప్రో కేర్స్ సంస్థ హైదరాబాద్ మణికొండలోని విప్రో కార్యాలయం లో 'మీ విప్రో భాగస్వామిని గురించి తెలుసుకోండి' (విప్రో – నో యువర్ పార్టనర్) సమావేశాన్ని 2023 మే 17వ తేదీన నిర్వహించింది. సమావేశానికి, హైదరాబాద్‌లోని విప్రో నలుగురు భాగస్వాములైన హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, ఆశయ ఆకృతి, సఫ్దరియా బాలికల ఉన్నత పాఠశాల, ఏపిమాస్ సంస్థలు పాల్గొన్నాయి. జిహెచ్ఎంసి పరిధిలోని కార్వాన్, మెహిదీపట్నం మునిసిపల్ సర్కిల్‌లలోని 14 మురికివాడలలో 'అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్' అమలు కోసం ఏపిమాస్ విప్రో కేర్స్‌తో భాగస్వామ్యం కలిగివుంది.

ఆరోజు అనేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భాగస్వాములందరూ తాము సాగిస్తున్న కార్యకలాపాలను పనులను ఆకట్టుకునే వివిధ ప్రదర్శనల రూపంలో, విభిన్న ఆలోచనలతో వివరించారు. భాగస్వామ్యసంస్థలు తమ కార్యక్రమాలను ప్రదర్శించడానికి అవసరమైన ఫ్లెక్స్, పోస్టర్‌లు, చార్ట్‌లు, ఇతర సామగ్రిని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఏపిమాస్ నుంచి సీనియర్ కన్సల్టెంట్ కళామణి, ప్రాజెక్ట్ మేనేజర్ భవాని, మెంటర్స్ రాణి, ప్రగతి, వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, వాష్ ప్రాంతీయ కో ఆర్డినేటర్ బ్రహ్మచారి, హెల్త్ ఫెసిలిటేటర్‌లు, కమ్యూనిటీ సైన్స్ కళాశాల నుండి ఇంటర్న్‌లు, ఐ సి డి ఎస్ నుండి అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య శాఖ నుండి ఆశా కార్యకర్తలు, స్వయం సహాయ బృందాల సభ్యులు కూడా పాల్గొన్నారు.

కార్యక్రమం సందర్భంగా చార్టులు, బ్యానర్లు, పోస్టర్లు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు పోషకాహారంపై పాము–నిచ్చెన గేమ్ మొదలైనవాటిని ప్రదర్శించారు. ఆహార పదార్థాలతో పది ఆహార సమూ హాలపై ఏపిమాస్ బృందం చేసిన రంగోలి సందర్శకుల దృష్టిని బాగా ఆకర్షించింది.

ఆశయ అకృతి, ఇతర భాగస్వామ్య సంస్థలు వినికిడి లోపం ఉన్న పిల్లలు రూపొందించిన పెయింటింగ్స్‌ను, తయారుచేసిన సంచులను ప్రదర్శించారు. సఫ్దరియా హైస్కూల్ తమ వారి ఉత్పత్తి యూనిట్ తయారు చేస్తున్న యూనిఫాంలు, అప్రాన్‌లు, కర్టెన్‌లు, ఇతర క్లాత్ మెటీరియల్ ప్రదర్శించింది. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ చిన్న ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి, సమావేశంలో పాల్గొన్న కొందరి బి.పి, బ్లడ్ గ్లూకోజ్ స్థాయిలను పరీక్షించడం, ఎత్తును , బరువును కొలవడంతోపాటు, తమ సంస్థకు సంబంధించిన కొన్ని విడియోలను ప్రదర్శించారు.

విప్రో నుండి సుమారు 200 మంది ఉద్యోగులు ఏపిమాస్ నిర్వహించిన స్టాల్స్‌ను సందర్శించారు. ఐసిడిఎస్, ఆరోగ్య శాఖల నుండి పాల్గొన్న ప్రతినిధులు పిల్లలకు ఇచ్చే బాలామృతం, ఐఎఫ్ఎ, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఇచ్చే కాల్షియం సప్లిమెంట్ల వంటి వాటిని ప్రదర్శించి, వారి పథకాల గురించి, వారి పాత్రల గురించి వివరించారు.

మధ్యాహ్నం సెషన్‌లో ఆశయ ఆకృతి ఫౌండేషన్ చిన్నారులచే గ్రూప్ డ్యాన్స్, సఫ్దరియా హైస్కూల్‌చే స్కిట్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌చే బంజారా పాటల నృత్య ప్రదర్శన, ఏపిమాస్ టీమ్‌చే తెలంగాణ సంప్రదాయ బతుకమ్మ డ్యాన్స్ వంటి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం (2023) సందర్భంగా చిరుధాన్యాలపై ఏపిమాస్ బృందం ఒక పాట పాడారు. మొత్తంమీద విప్రో కేర్స్ 'మీ విప్రో భాగస్వామిని గురించి తెలుసుకోండి' కార్యక్రమం వినూత్నంగా, ఆహ్లాదకరంగా ఆనందదాయకంగా గుర్తుంచుకునేలా సాగింది. ■

గారడీతో కల నెరవేరదు; తపన పడాలి, పట్టుదల పెరగాలి, చెమట చిందించాలి

# పుట్టపర్తి జిల్లాలో చిరుధాన్యాల మహోత్సవం!

– బి. ఇ. అనిల్ కుమార్




ఆధునిక జీవనశైలిలో అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న పోషకాహార, రోగనిరోధకశక్తి లోపాన్ని అధిగమించడానికి భారతదేశం వేదికగా యావత్ ప్రపంచానికి చిరుధాన్యాల పోషక విశిష్టతపై అవగాహన కల్పించాలని భారత ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం వేడుకను ఘనంగా నిర్వహించాలని సంకల్పించింది. తద్వారా దేశంలో 'చిరు విప్లవం' తేవడానికి నాంది పలికింది.

మునుపు దేశంలోని ఆహార ధాన్యాలలో 20% ప్రాతినిధ్యం వహిస్తున్న చిరుధాన్యాలు ప్రస్తుత కాలంలో 6% తగ్గిపోయింది. కానీ, ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా రీత్యా మెట్ట వ్యవసాయంపై ఎక్కువగా దృష్టి సారించాల్సి ఉంటుంది. రైతుకు స్థిరమైన దిగుబడి ఇవ్వగల సామర్థ్యం చిరుధాన్యాలకు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో 'ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్' ఈ క్రింది లక్ష్యాలను నిర్దేశించింది.

- ప్రస్తుత పరిస్థితులలో ఆహార, పోషక భద్రతలో చిరు ధాన్యాల కీలక పాత్రపై అవగాహన పెంపొందించడం
- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చిరుధాన్యాలలో స్థిరమైన ఉత్పత్తి, నాణ్యతను మెరుగుపరచడంపై వాటాదారులకు అవగాహన కల్పించడం.
- పరిశోధన అభివృద్ధి, విస్తరణ సేవలను మెరుగుపరచడం ద్వారా పైరెండు లక్ష్యాలసాధనకు సహకరించుట.

పైన తెలిపిన 3 లక్ష్యాల మేరకు, మే 19వ తేదీన పుట్టపర్తి జిల్లాలో డి ఆర్ డి ఏ – వైకెపి తరపున ఘనంగా చిరుధాన్యాల మహోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ



వేడుకలో చిరుధాన్యాలు పండించే రైతులు, పుట్టపర్తి జిల్లాలోని అన్ని మండల మహిళా సమాఖ్య లీడర్లు, సభ్యులు, జిల్లాస్థాయి వ్యవసాయ అధికారులు, జిల్లా కలెక్టర్ శ్రీ అరుణ్ బాబు, స్థానికశాసన సభ్యులు శ్రీ శ్రీధర్ , వ్యవసాయంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ చిరుధాన్యాల మహోత్సవంలో అన్ని మండల మహిళా సమాఖ్యల తరపున చిరుధాన్యాలతో తయారు చేసినటువంటి

పిండి పదార్థాలను ప్రదర్శించారు. స్వచ్ఛంద సంస్థలు కూడా చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఏపిమాస్ నిర్వహిస్తున్న క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు సిబ్బంది తరపున 8 రకాల చిరుధాన్యాల విత్తనాలు, వాటి బియ్యం, నాలుగు రకాల రాగి విత్తనాలు, చిరుధాన్యాలలో ఉన్నటువంటి పోషకాల గురించి తెలియజేసే ప్రచార పత్రాలను ప్రదర్శించడం జరిగింది. ఈ 'చిరు' మహోత్సవం సందర్భంగా రైతులకు, ప్రభుత్వ సంస్థల సిబ్బందికి, మహిళలకు అన్ని రకాల చిరుధాన్యాల గురించి, వాటి ప్రాముఖ్యత ఏపిమాస్ ప్రదర్శనశాలలో వివరించడం జరిగింది.

ఏపిమాస్ చిరుధాన్యాల ప్రదర్శనను పుట్టపర్తి జిల్లా కలెక్టర్ శ్రీ అరుణ్ బాబు, స్థానిక ఎమ్మెల్యే శ్రీ శశిధర్, పి డి ఆర్ డి ఏ శ్రీ నరసయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ వై వి సుబ్బారావు, జిల్లాస్థాయి ఇతర అధికారులు సందర్శించి, విత్తనాల స్టాల్‌ను మెచ్చుకుని, క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు సిబ్బందికి సర్టిఫికెట్, అ మెమెంటో అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ అరుణ్ బాబు మాట్లాడుతూ చిరుధాన్యాలు మానవ జీవితానికి ప్రకృతి ప్రసాదించిన వరమని, చిరుధాన్యాలు కరువును బాగా తట్టుకొని మంచి దిగుబడిని యిస్తాయని, మెట్ట ప్రాంతాలకు చిరుధాన్యాలు అమూల్యమైన వరమని అన్నారు. గతంలో ప్రజలు చిరుధాన్యాలతో వండిన వంటలను తిని వాటిలో పుష్కలంగా ఉండే ప్రోటీన్లు, ఖనిజ లవణాలు, విటమిన్ల కారణంగా శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యంగా వుండేవారని, బియ్యం గోధుమలకన్నా చిరుధాన్యాలు ఎన్నో రెట్లు పోషకాలను అందిస్తాయని వివరించారు

చిరుధాన్యాలు సమతుల పోషకాహారాన్ని అందిస్తాయని, సూక్ష్మ పోషకాలైనటు వంటి బి కాంప్లెక్స్, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉండటం వలన వీటి వాడకం ఆరోగ్యానికి ఎంతో మంచిదని, అధిక మెగ్నీషియం, పొటాషియం ఖనిజ లవణాలు లభించడం వల్ల రక్తపోటు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని. చిరుధాన్యాలను ఆహారంగా వాడే వారికి క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు కూడా




తగ్గుతాయని, రక్తహీనతను, మధుమేహ వ్యాధిని తగ్గించడంలో యివి సహాయపడతాయని సమావేశంలో ప్రసంగించిన యితర వక్తలు వివరించారు. ■

## పాలకోవాలో మేటి ...

**(11 వ పేజీ తరువాయి)**

ఎస్ 4 ఎస్ టెక్నాలజీస్ ' అనే సంస్థ అందజేస్తుంది. ఏ పి ఎఫ్ పి ఎస్ తోడ్పాటుతో 35% సబ్సిడీతో లబ్ధిదారులకు బరోడా బ్యాంక్ రుణాలు యిస్తుంది.

లబ్ధిదారులు తాము ప్రాసెస్ చేసిన ఉల్లిపాయలను, టమాటాలను తిరిగి 'ఎస్ 4 ఎస్ టెక్నాలజీస్' కు విక్రయించాల్సి వుంటుంది. ఒక్కొక్క కిలో ఉల్లిపాయలను ప్రాసెస్ చేసినందుకు మహిళలకు 2-40 రూపాయల వంతున ' ఎస్ 4 ఎస్ టెక్నాలజీస్ ' చెల్లిస్తుంది. ఒక్కొక్క మహిళ రోజుకు 2 నుంచి 4 బస్తాల (బస్తా అంటే 50 కిలోలు) ఉల్లిపాయలను ప్రాసెస్ చేయగలుగుతారు. ఈ విధంగా రోజుకు 240 నుంచి 480 రూపాయలు సంపాదించగలుగుతారు. కొన్ని కుటుంబాలలో కుటుంబ సభ్యులందరూ ఈ ప్రాసెసింగ్‌లో పాల్గొంటారు. అందువల్ల వారు రోజుకు 5-6 బస్తాల వరకు ప్రాసెస్ చేయగలుగుతారు.

అయితే, 'ఎస్ 4 ఎస్ టెక్నాలజీస్' వీరి శ్రమకు తగిన ప్రతిఫలం చెల్లిస్తున్నదా, వీరిశ్రమతో తానెంత లాభం పొందుతున్నదీ అనే విషయాలు బయటికి రావడంలేదు. ■

ఇతరుల మాదిరే నీవూ వుండాలనుకుంటే, అసలు నీవు వుండడమెందుకు ?

# గుత్తి ప్రాజెక్ట్‌లో సాధనలు, సమస్యలు !

– ఎస్. నరసింహారావు

ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి 2023 మే 6 వ తేదీన న గుత్తి ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా 'ఆశను పొదిగి, ఆదాయాన్ని పెంచుకుని' (హాచింగ్ హోప్ ఫర్ యాక్సిలరేటింగ్ ఇన్‌కం) కార్యక్రమం కింద పామిడి మండలంలోని అనుంపల్లె గ్రామంలో పెరటి కోళ్ళ పెంపకం చేపట్టిన ఇద్దరు రైతులను కలసి , వారి కోళ్ళ షెడ్స్‌ను సందర్శించి, వారు కోళ్ళ పెంపకం



సాగిస్తున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. రైతులు కోళ్ళ పెంపకంలో తాము చేపట్టిన వినూత్న ప్రయోగాల (ఒకరోజు కోడిపిల్లలను పెంచడం, దాణా కోసం పురుగుల పెంపకం, ప్రత్యామ్నాయ దాణా వినియోగం) గురించి, పెరటి కోళ్ళ పెంపకానికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికను వివరించారు. శ్రీ రెడ్డి వారికి రెండవ విడతలో కోళ్ళ పెంపకం కోసం తగిన జాతి కోళ్ళను జాగ్రత్తగా ఎంచుకోవాలని ఆదాయం పెంచుకోవడానికి కోళ్ళ పెంపకంలో వున్న అవకాశాల గురించి సూచించారు.

అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి గార్లదిన్నెకు చెందిన 'రైతుహిత రైతు ఉత్పత్తిదారుల కంపెనీ' డైరెక్టర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ పి ఓ(రైతు ఉత్పత్తిదారుల సంఘం)తన సభ్యులకు మరిన్ని సేవలను అందించాలని, దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించుకోవాలని, అందుకోసం డైరెక్టర్లు నెరవేర్చాల్సిన బాధ్యతలను గురించి డైరెక్టర్లకు ఆయన మార్గనిర్దేశం చేశారు. డైరెక్టర్లు ఏపిమాస్ సంస్థ నుంచి తాము ఆశిస్తున్న సహకారాన్ని గురించి వివరించగా, ఏపిమాస్ సంస్థ అందించగలిగే సహాయాన్ని ఆయన వివరించారు.

ఈ సమావేశం అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి గుత్తి కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది తమ విధులను నెరవేర్చడంలో ముందస్తు ప్రణాళిక ఆవశ్యకతను ఆయన వివరించారు. తరువాత సి.ఈ.వో. గారు సిబ్బంది ప్రతి ఒక్కరినీ సంస్థలో తమ బాధ్యతలను నెరవేర్చడంలో సాధించిన మూడు విజయాలను, ఎదుర్కొన్న మూడు సవాళ్లను/ అపజయాలను రాయమని నిర్దేశించారు.

అలా ప్రతి ఒక్కరూ రాసిన విజయాలు, సవాళ్ళు తెలుపగా, సిబ్బంది ఆలోచన ప్రకారం 20 ముఖ్యమైన విజయాలు, 17 సవాళ్ళు పేర్కొనడమైనది. చివరగా సి.ఈ.వో. గారు విజయాలను, సవాళ్ళను క్రోడీకరించి, ప్రతి ఒక్క సిబ్బంది ప్రతి ఒక్కరికి తగిన ప్రోత్సాహాన్ని అందించి, సిబ్బందితో ఒక ఫోటో తీసుకోవడంతో సి.ఈ.వో. గారి సందర్శన పూర్తి అయింది.

**సాధించినవి**

1. రైతు సంఘం పైన సభ్య రైతులకు నమ్మకం ఏర్పడింది.
2. పెద్దవడుగూరు ఎఫ్ పి ఓచే రూ.40 లక్షల లావాదేవీలు
3. పామిడి రైతు సంఘంలో 400 మంది కంటే ఎక్కువ మంది సభ్యులు చేరారు.
4. కొందరు సిబ్బందికి ఎఫ్ పి ఓతో పని చేయడం కొత్తయినా అర్థం చేసుకొని ఎఫ్ పి ఓ బలోపేతానికి కృషి చేస్తున్నారు.
5. రైతులతో, కంపెనీలతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి.
6. పెద్దవడుగూరు రైతుసంఘం కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి భూమి కొనుగోలుకు కృషి చేస్తోంది.
7. రైతులకు తమ ఊరిలోనే ఎరువులు అందుతున్నాయి

8. గుంతకల్లో రెండు కలెక్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టారు
9. పామిడి ఎఫ్ పి ఓ ఉత్పాదకాల అమ్మకం పెరుగుతోంది.
10. పెద్దవడుగూరు ఎఫ్ పి ఓ రైతులు ఇతర ఎఫ్ పి ఓలను (నార్పల, నంద్యాల) సందర్శించారు.
11. ఒక ఎఫ్ పి ఓ సిబ్బంది మరో ఎఫ్ పి ఓలో వాటాదారుల చేరికకు, ఖాతాపుస్తకాల నిర్వహణకు సహకరిస్తున్నారు.
12. 'హోచింగ్ హెూప్ ఫర్ యాక్సిలరేటింగ్ ఇన్‌కం' పథకంలో అందిస్తున్న శిక్షణలు ఎఫ్ పి ఓలు సభ్య రైతులతో ఎక్కువగా కలవడానికి, రైతు సంఘంపై గుణాత్మకమైన అభిప్రాయాన్ని కలిగించడానికి దోహదపడుతున్నాయి.
13. సి ఇ ఓలు లేని ఎఫ్ పి ఓలలో కూడా ఆ ఎఫ్ పి ఓల బలోపేతానికి సిబ్బంది కృషి చేస్తున్నారు.
14. తాడిపత్రి రైతు సంఘం ఇప్పటివరకు 50 లక్షల రూపాయల టర్నోవర్ని అందుకుంది.
15. పశు సంబంధిత ఉత్పాదకాలను అందుబాటులోకి తేవడం ద్వారా రైతు అభివృద్ధి కేంద్రాలలో ఉత్పాదకాల వైవిధ్యం పెరిగింది.
16. వేరుశెనగ మార్కెటింగ్ పామిడిలో బాగా జరిగింది.
17. శిక్షణ పొందిన పశుసఖిలు గ్రామస్థాయిలో కోళ్ళకు టీకాలు వేసే సేవలు అందిస్తున్నారు.
18. సహజ పద్ధతిలో వ్యవసాయాన్ని ప్రోత్సహించుటకు రెండు బయో రిసోర్స్ సెంటర్స్ ఏర్పాటయ్యాయి.
19. గుంతకల్లు ఎఫ్ పి ఓ 27 లక్షల రూపాయల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ జరిపింది.
20. ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అందవలసిన సబ్సిడీలను రైతుహిత ఎఫ్ పి సి అందేలా చేసింది.

**సమస్యలు, సవాళ్ళు**

1. ఎమ్.ఐ.డి.హెచ్. రైతు సంఘాలలో కంప్యూటరీకరణ జరగకపోవడం
2. ఏఎఫ్ పి ఓ తమ నిర్వహణ ఖర్చులను స్వయంగా భరించగలిగే స్థితిలో లేకపోవడం
3. మారుమూల గ్రామాల నుంచి సభ్యులను చేర్చడంలో వెనుకంజ.
4. బి.డి.వో. అన్నీ రైతు సంఘాలకు మార్కెటింగ్‌కు పూర్తి సహకారం అందించలేకున్నాడు.
5. పెద్దవడుగూరులో పంట ఉత్పత్తుల మార్కెటింగ్ అనుకున్నంతగా జరగడంలేదు.
6. ఎఫ్ పి ఓలకు కావలసిన లైసెన్సులు పొందలేకపోవడం. వ్యవసాయ శాఖ సహకారం అంతగా లేదు.
7. ఎఫ్ పి ఓ సి.ఈ.ఓ.లు తరచుగా మారిపోవడం.
8. పండించిన పంటలకు కొనుగోలుదారులు, కొనుగోలు ఆర్డర్‌లు తక్కువగా వుండడం.
9. ఎరువులుమొదలైన ఆవశ్యకాలు సీజన్లో అందుబాటులో లేకపోవడం.
10. ఎఫ్ పి ఓలకు బ్యాంకు రుణాలు రాకపోవడం.
11. జిల్లా ఎఫ్ పి ఓల సమాఖ్యకు తగిన నిధులు, సహకారం లేకపోవడం.
12. ఉద్యానశాఖ నుంచి రావలసిన నిధులు మంజూరు కాకపోవడం.
13. కనీస మద్దతు ధరతో ఉత్పత్తుల సేకరణ జరగకపోవడం
14. వాటాదారుల చేరిక నిబంధనలు కఠినమవడం.
15. రైతువారీగా పంట వివరాలను క్రమం తప్పకుండా సేకరించలేకపోవడం.

**భవిష్యత్తు ప్రణాళిక**

1. అన్ని మొదటి విడత ఎఫ్ పి ఓలలో 750 మంది సభ్యులను వాటాదారులుగా చేర్చడం.
2. అన్ని రెండవ విడత ఎఫ్ పి ఓలలో 500 మంది సభ్యులను వాటాదారులుగా చేర్చడం.
3. అన్ని ఎఫ్ పి ఓలకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల లైసెన్సులను పొందడం.
4. అన్ని ఎఫ్ పి ఓలు వాటి నిర్వహణ ఖర్చులను అవే భరించే స్థాయికి చేరుకోవడం.
5. ప్రతి ఎఫ్ పి ఓ కనీసం సగంమంది సభ్యులకు ఏదో ఒకరకమైన సేవలను అందించడం.
6. ప్రతి ఎఫ్ పి ఓ కనీసం కోటి రూపాయల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేయడం ■

మాటలతో, చేతలతో నొప్పించే వారికంటె, ఆత్మీయుల అనాదరణ మరింత బాధాకరం

# సెర్ప్ ప్రగతి ప్రస్థానం...ఎస్ హెచ్ జి ల జయకేతనం!

### ముగ్గురు మహనీయుల మార్గదర్శన ఫలం !

*కొంచెం అటుయిటుగా పాతిక సంవత్సరాలు! అనంత కాల ప్రవాహంలో ఇది చాలా స్వల్ప పరిమాణం . కాని ఈ స్వల్పకాలమే ఒక అమోఘమైన,అద్భుతమైన వ్యవస్థకు ఊపిరులూదింది. సమాజంలో ఒక అపూర్వమైన, ఆశావహమైన మార్పుకు శ్రీకారం చుట్టింది. తరతరాల బడుగు బతుకులకు ఉజ్వల భవిష్యత్తును కనులముందు నిలిపింది. ఇది జంట విజయాల జమిలి కథ! స్వయంశక్తి, మహిళల సంఘటిత బలం, సహకార ప్రోత్సాహాలు సాధించి, ప్రపంచానికి చాటిన 'వెలుగు' వెల్లువల వాస్తవగాథ! ఈ ప్రగతి ప్రస్థానంలో ముందడుగు అన్నివిధాల బలహీనులుగా భావింపబడిన పేద మహిళలదైతే, వారి వెనుక అండదండగా నిలిచి, తొలినాళ్ళలో వారిలో చెలరేగిన జంకుగొంకులను నివారించి, వారిలో నిగూఢంగా వున్న స్వయంశక్తిని ప్రేరేపించి, వారిని విజయశిఖరాలకు నడిపించిన ఖ్యాతి తెలుగు రాష్ట్రాలలో నాటి యు ఎన్ డి పి, నేటి సెర్ప్‌తోపాటు ఏపిమాస్ వంటి కొన్ని స్వచ్ఛంద సంస్థలకు దక్కుతుంది. ఈ మహిళా స్వయంసహాయ మహోద్యమంలో నాటినుంచి నేటివరకు ఒక ప్రత్యక్ష సాక్షిగా, కీలక భాగస్వామిగా, ప్రోత్సాహకుడిగా వుంటూ యు ఎన్ డి పి, సెర్ప్ సంస్థలలో ఉన్నత పదవులు నిర్వహించి, యిటీవల పదవీ విరమణచేసిన శ్రీ డి జగన్నాథరావు 'సెర్ప్ ప్రస్థానం' పేరిట తన అనుభవాలను, పరిశీలన అంశాలను వెల్లడించారు. సమాజ ముఖచిత్రాన్ని గణనీయంగా మార్చివేసిన ఆ పాతికేళ్ళ చరిత్ర ప్రధాన ఘట్టాలను క్లుప్తంగా ఆయన మాటలలోనే తెలుసుకుందాం.*



*డి జగన్నాథరావు*

1996-97 సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఆ నూతన క్రాంతి సూత్రధారి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'దక్షిణ ఆసియా పేదరిక ఉపశమన పథకం' (సపాప్). ఆ పథకాన్ని ఆ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా మూడు వెనుకబడిన ప్రాంతాలైన మహబూబ్ నగర్, కర్నూలు, అనంతపురం జిల్లాలలోని 20 మండలాలలో అమలులోకి తెచ్చారు. పూర్తిగా పేదల పక్షపాతి, నిత్యచైతన్యశీలి, మేలుచేయాలని తపనపడే ఐ ఏ ఎస్ అధికారి శ్రీ కె.రాజు నాయకత్వంలోని నలుగురు సీనియర్ ప్రభుత్వోద్యోగుల బృందం ఎంతో అంకితభావంతో ఈ పథకం అమలుకు పాటుబడింది.

**సి ఎస్ రెడ్డి బృందం తోడ్పాటు**

పేద మహిళలను కలుసుకుని, మాటాడి, అవగాహన కలిగించి, వారిని ఎస్ హెచ్ జిలుగా సంఘటితపరచడానికి, ఆ సంఘటిత బృందాలు క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడానికి వీలుగా అవగాహన పర్యటనలను నిర్వహించడానికి సంబంధించిన మౌలిక అంశాలను ఈ నలుగురు సీనియర్ ప్రభుత్వోద్యోగుల బృందం అనాడు కేర్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రధానాధికారిగా వున్న (ప్రస్తుతం ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ, ఎండి) శ్రీ సి ఎస్ రెడ్డి బృందం నుంచి నేర్చుకున్నది.

కర్ణాటకలో ఎస్ హెచ్ జి లతో 'మైరాడ' సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను, పాకిస్తాన్‌లోని గిల్‌గిట్ ప్రాంతంలో గ్రామీణ సామాజిక సంస్థల తోడ్పాటుతో పేద ప్రజలను పేదరికం నుంచి బయటకు తేవడానికి ఏ కె ఆర్ ఎస్ పి సాగిస్తున్న విశేషకృషి విజయగాథలను ఈ బృందం నిశితంగా పరిశీలించింది. ఇంతేకాకుండా నాడు ఎంతో పేరు

ప్రతిష్ఠలు పొందిన బంగ్లాదేశ్ 'గ్రామీణ బ్యాంక్' వ్యవస్థను, అహ్మదాబాద్‌లోని 'సేవా బ్యాంక్' ను, శ్రీలంకలోని 'విమెన్స్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్' ను నేరుగా సందర్శించి, సామాజిక సమీకృత వ్యూహాల ద్వారా, మహిళా సాధికారత ప్రక్రియల ద్వారా క్షేత్రస్థాయిలో సాధిస్తున్న ఫలితాలను ఈ బృందం ప్రత్యక్షంగా తెలుసుకున్నది. మొత్తం ఈ సమయమంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధనాలుగా పేద మహిళలతో ఎస్ హెచ్ జిలు, గ్రామసంఘాలు (వి ఓలు), మండల సమాఖ్యలతో కూడిన వ్యవస్థ రూపకల్పనలో, దానికి మెరుగులు దిద్దడంలో సపాప్ బృందం, కేర్ ఆంధ్రప్రదేశ్ బృందం కలసికట్టుగా పనిచేశాయి.

ఈ విధంగా శ్రీ కె రాజు నాయకత్వంలోని సపాప్ ప్రాజెక్ట్ తొలి నాలుగేళ్ళ కాలంలో 20,000 ఎస్ హెచ్ జి లను, 800 వి ఓ లను, 20 మండల సమాఖ్యలను ఏర్పాటు చేయడంతో పాటు, సామాజిక సంపదగా స్వయంసహాయ రంగంలో సుశిక్షితులైన వెయ్యిమంది నిపుణులను సిద్ధంచేసి పెట్టింది. ఈ నేపథ్యంలో, 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక సంస్థల ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు నిధులు సమకూర్చాలని ఎదురుచూస్తున్న ప్రపంచ బ్యాంక్‌ను ఈ ఎస్ హెచ్ జిలు, వి ఓలు, మండల సమాఖ్యలతో కూడిన వ్యవస్థ ఎంతగానో ఆకట్టుకున్నది.

సపాప్ ప్రాజెక్ట్ ముగిసిపోతున్న ఆ తరుణంలో ప్రపంచ బ్యాంక్ ఆసియా–పసిఫిక్ ప్రాంత ఉపాధ్యక్షుడు ఆ ప్రాజెక్ట్ అమలు జరుగుతున్న మూడు జిల్లాలలో పర్యటించి, సపాప్ కార్యక్రమాలను సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి నాయకులతో సపాప్ రూపొందించిన వ్యవస్థను గురించి ప్రశంసిస్తూ, ఆ నమూనా ఎంతో విశిష్టమైనదని, ఒక ఎన్ జి ఓ కు వుండే అన్ని సానుకూలతలు వుండడంతో పాటు, ఒక ప్రభుత్వ సంస్థకు వుండే ప్రతికూలతలేవీ లేకపోవడం సపాప్ వ్యవస్థ ప్రత్యేకత అని కొనియాడారు.

### సెర్ప్ ఆవిర్భావం

2000 సంవత్సరంలో ప్రభుత్వ నిర్వహణలో రాష్ట్రంలోని పేదలందరికి అండదండగా స్వతంత్రంగా పని చేసే పబ్లిక్ సొసైటీగా 'సెర్ప్' ఏర్పాటైంది. సి ఇ ఓ హోదాలో ఆ సంస్థ అధినేతగా శ్రీ కె రాజునే నియమించడం విశేషం!

డి పి ఐ పి ప్రాజెక్ట్ పేరుతో ముందుగా ఆరు జిల్లాలలో, ఆ తర్వాత ఆర్ పి ఆర్ పి ప్రాజెక్ట్ పేరిట మిగిలిన 16 జిల్లాలలో సెర్ప్ కార్యక్రమాల నిర్వహణకు ప్రపంచ బ్యాంక్ నిధులు సమకూర్చింది.

### ఏపిమాస్ ఆవిర్భావం

ఇదే తరుణంలో, అభివృద్ధిరంగ నిపుణుడైన శ్రీ సి ఎస్ రెడ్డి నాయకత్వంలోని కేర్ ఆంధ్రప్రదేశ్ బృందం ఏపిమాస్ (మహిళాభివృద్ధి సొసైటి,ఆంధ్రప్రదేశ్ ) పేరిట ఒక విశిష్ట సంస్థను హైదరాబాద్ కేంద్రంగా నెలకొల్పారు. పేదల అభ్యున్నతి కోసం పనిచేసే నిపుణులైన సిబ్బంది ఏపిమాస్‌లో చేరారు. ప్రభుత్వ రంగంలోని ప్రముఖ వ్యక్తులను మార్గదర్శకులుగా తన ఎగ్జిక్యూటివ్ కమిటిలో చేర్చుకుని అది మరింత బలోపేతమైంది.

సెర్ప్ స్వతంత్రంగా పని చేస్తూ, రాష్ట్రంలోని పేదలకు, వారి సంస్థలకు ప్రయోజనంచేకూరే విధంగా, నిరంతర శిక్షణలు, సామర్థ్యం మదింపు, సామాజిక శిక్షకులను తయారుచేయడం వంటి కార్యక్రమాలలో పూర్తిగా నిమగ్నమైంది. పూర్తి అంకితభావంతో సెర్ప్ నిర్వహించిన ఆ కార్యక్రమాల ఫలితంగా ఈనాడు ఉభయ తెలుగు రాష్ట్రాలలో 10 లక్షల ఎస్ హెచ్ జిలు, 40 వేల వి ఓలు, 1100 మండల సమాఖ్యలు ఏర్పాటయ్యాయి. కోటి మంది (10 మిలియన్ల) సభ్యులకు సేవలందిస్తున్నాయి.


### స్మరణీయులైన ఆ ముప్వురు !

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని ప్రస్తుత సెర్ప్ సంస్థల వారు ముగ్గురు మహ నీయులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలి.

సెర్ప్ రూపశిల్పులు, అభివృద్ధిపథ నిర్దేశకులైన ఆ

ముఖ్యరు : శ్రీ షోయిబ్ సుల్తాన్ ఖాన్, శ్రీ కె రాజు, శ్రీ టి.విజయకుమార్.

**శ్రీ షోయిబ్ సుల్తాన్ ఖాన్**



శ్రీ షోయిబ్ సుల్తాన్ ఖాన్ పాకిస్తాన్‌లో ప్రభుత్వ ఉన్నతాధికారి (సివిల్ సర్వీసెస్). యు ఎన్ డి పి సలహాదారుగా ఆయన అందించిన సేవలకు ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డుతో పాటు, పాకిస్తాన్ ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందు కున్నారు. ఆయన మనకు సపాప్ ప్రాజెక్ట్ అమలులోను, అనంతరం సెర్ప్ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోను నితంతర మార్గదర్శనం, మద్దతు అందించారు.

ప్రభుత్వ అధికారులతో, ప్రాజెక్ట్ ప్రతినిధులతో, సామాజిక క్రియాశీలురతో, క్షేత్రస్థాయి సభ్యులతో ఆయన ఎన్నెన్నో సమావేశాలు జరిపి అనేక విషయాలపై అవగాహన పెంపొందించారు. ఆయన సూచనలు, సలహాలు, మార్గదర్శనంతో సెర్ప్ తన స్వరూప స్వభావాలకు ఎప్పటి కప్పుడు మెరుగులు దిద్దుకోగలిగింది. పేదలను సంఘటిత పరచడానికి అనుసరించవలసిన పద్ధతులపై పూర్తి స్పష్టతను సంతరించుకోగలిగింది.

**శ్రీ కె రాజు**



1981బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐ ఏ ఎస్ అధికారి అయిన శ్రీ కె రాజు యు ఎన్ డి పి – సపాప్ ప్రాజెక్ట్ ఇండియా విభాగానికి నేషనల్ కోఆర్డినేటర్ గా పనిచేశారు. శ్రీ రాజు రాజీఎరుగని పేదల పక్షపాతి! ఆయన అంకితభావం, కార్యనిర్వహణ సామర్థ్యం మొత్తం దక్షిణ ఆసియాలోనే యిలాంటి ప్రాజెక్టులలో సపాప్‌ను అగ్రస్థానంలో నిలిపాయి. సామాజిక సంస్థల నమూనాతో ఆయన సాధించిన విజయాలు ప్రపంచబ్యాంకు నిస్సంకోచంగా సపాప్‌కు నిధులు మంజూరుచేయడానికి ముందుకు వచ్చేలా చేశాయి.

సెర్ప్ ఆవిర్భావం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వివేకంతో శ్రీ రాజుకే సెర్ప్ సారథ్య బాధ్యతలు అప్పగించింది. మూడేళ్ళపాటు సెర్ప్ సి ఇ ఓగా, ఆ తర్వాత గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా ఆయన తన నిరాడంబర వ్యక్తిత్వంతో, అందరికీ అందుబాటులో వుండే పనితీరుతో క్షేత్రస్థాయిలో పని చేసే వారితో సహా సెర్ప్ సిబ్బందిలో గొప్ప సమన్వయం, సమైక్యత సాధించగలిగారు.

శ్రీ రాజు నిర్విరామ కృషి ఫలితంగా నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోని సెర్ప్, దాని ఆధ్వర్యంలో వికసించిన పేదల సంస్థలు మొత్తం దేశంలోనే విజయగాథలకు పర్యాయపదాలుగా మారాయి.

**శ్రీ విజయకుమార్**



మరో ఐ ఏ ఎస్ అధికారి శ్రీ టి. విజయకుమార్ పదేళ్ళపాటు సెర్ప్ సారథ్య బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ వ్యవస్థలో ఒక ఉన్నతాధికారి ఇంతటి సుదీర్ఘకాలం ఒక సంస్థ అధినేతగా పని చేయడం ఎంతో అరుదైన విషయం!

శ్రీ విజయ కుమార్ సెర్ప్‌లో అప్పటివరకు అమలుజరుపుతున్న కార్యక్రమాలను కొనసాగిస్తూనే, తన నిర్విరామ కృషితో, మానవీయ విలువలతో 4 వినూత్న అభివృద్ధి రంగాలను, నవ్య ప్రక్రియ లను ప్రవేశపెట్టారు. అన్నిటికంటె సెర్ప్‌కు ఆయన చేసిన గొప్పసేవ ఎస్ హెచ్ జిలను బ్యాంకులతో అనుసంధానించే కార్యక్రమాన్ని ప్రారంభించడం.

కేవలం 384 కోట్ల రూపాయల వార్షిక లావాదేవీల స్థాయినుంచి ఐదేళ్ళలో, 2010 నాటికి, బ్యాంకుల అనుసంధాన వార్షిక లావాదేవీలను 7,000 కోట్ల రూపాయల స్థాయికి చేర్చడం ఆయన సాధించిన గొప్ప విజయం! రాశిని పెంచడమే కాదు, వాసిలో కూడా మేటిగా ఈ బ్యాంకుల అనుసంధాన కార్యక్రమం ఎంతో పకడ్బందీగా కొనసాగేలా ఆయన అన్నిజాగ్రత్తలు తీసుకున్నారు.

ఎస్ హెచ్ జి ల స్థాయిలో సూక్ష్మరుణ ప్రణాళికను ప్రవేశపెట్టడంతో పాటు అప్పులు పొందడం, తిరిగి చెల్లించడంలో

వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది

బ్యాంకుశాఖలకు – ఎస్ హెచ్ జి లకు మధ్య సామాజిక మధ్యవర్తిత్వ ప్రక్రియలను చేపట్టడం వంటివి ఈ కోవలోకి వస్తాయి.ఆనాడే , బ్యాంకులతో అనుసంధానం తొలిరోజులలోనే, శ్రీ విజయకుమార్ చేపట్టిన ఈ ముందు జాగ్రత్త చర్యలు యిప్పటికీ ఎంతగానో సత్ఫలితాలను అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో ఒక్కొక్క రాష్ట్రంలో 15,000 కోట్ల రూపాయల స్థాయికి చేరిన ఎస్ హెచ్ జిల బ్యాంకు రుణాలే ఇందుకు ప్రబల నిదర్శనం!

శ్రీ విజయకుమార్ ప్రారంభించిన మరో విజయవంతమైన కార్యక్రమం గ్రామ సంఘాలచే (వి ఓలచే) ధాన్యం సేకరణ చేయించడం. గ్రామ సంఘాలలో నిర్వహణ సామర్థ్యం, ఆర్థిక లావాదేవీల కనీస పరిజ్ఞానం కలిగిన సామాజిక బృందాలు ధాన్యం సేకరణ బాధ్యత వహించేలా ఆయన తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

తెలంగాణాలో ఈ కార్యక్రమంలో ప్రస్తుతం 20% నుంచి 25% వి ఓలు పాలుపంచుకుంటూ, రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ధాన్యంలో 40% ధాన్యాన్ని సేకరిస్తున్నాయి. తూకాలు సరిగా వుండడం, ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా రైతులకు గిట్టుబాటు ధర అందించడం, సకాలంలో చెల్లింపులు చేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకతలు. తెలంగాణా సెర్ప్‌లో ఇది ఎంతో విజయవంతమైన కార్యక్రమం! ధాన్యం సేకరణ సాగిస్తున్న అన్ని వి ఓలు తమ మూలధనాన్ని గణనీయంగా పెంచుకోగలిగాయి.

శ్రీ విజయకుమార్ సెర్ప్‌కు జాతీయస్థాయిలో మరో గొప్ప సేవ చేశారు. సెర్ప్‌లో 'ఎన్ ఆర్ ఎల్ ఎం రిసోర్స్ సెల్' (జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ వనరుల కేంద్రం) అనే కొత్త విభాగాన్ని ప్రారంభించి, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్, బీహార్, జార్ఖండ్ మొదలైన 12 రాష్ట్రాలలో ఎస్ హెచ్ జిలు, వాటి సమాఖ్యల ఏర్పాటుకు, వాటి బలోపేతానికి కృషి చేశారు.

సెర్ప్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులు, సుశిక్షితులు, తగినంత హిందీ భాషా పరిజ్ఞానం కలిగిన సామాజిక నిపుణులను ఆ రాష్ట్రాలకు పంపి, వారు అక్కడ కొంతకాలం వుండి, ఎస్ హెచ్ జిలు, ఎస్ హెచ్ జి సమాఖ్యల నిర్వహణ వ్యవహారాలలో వారికి సలహాలు, సూచనలు, మద్దతు అందించేలా చేశారు.

ఈ తోడ్పాటు ఆ రాష్ట్రాలలో ఎస్ హెచ్ జిల వ్యవస్థ కేవలం ఐదేళ్ళ కాలంలో చక్కగా రూపుదిద్దుకుని, బలోపేతం కావడానికి ఎంతగానో ఉపకరించింది. అటు పేద కుటుంబాల, యిటు ప్రభుత్వ వర్గాల ప్రశంసలను చూరగొన్నది. ఇప్పుడు ఆ 12 రాష్ట్రాలలో ఎస్ హెచ్ జి వ్యవస్థ వెలుపలి సహాయం లేకుండానే, స్వావలంబనతో, పటిష్ఠమైన పునాదులపై గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నది.

**నాలుగు కీలక అంశాలు**

సెర్ప్ విజయ ప్రస్థానం గ్రామీణ పేదరిక నిర్మూలనకు ఈ క్రింది నాలుగు కీలక కార్యక్రమాలు అత్యవసరమని నిరూపించింది.

1) పేదరిక సమస్యలను నేరుగా పరిష్కరించడంకోసం వారి సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా పేదల సంస్థలను ఏర్పాటుచేయడం
2) ఆ సంస్థలలో సభ్యులకు అవసరమైన శిక్షణలను యివ్వడం, సామర్థ్యం పెంపు కార్యక్రమాలను చేపట్టడం ద్వారా సభ్యుల స్వయం నిర్వహణను, స్వావలంబనను పెంపొందించవచ్చు
3) ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు తమ పెట్టుబడులను నేరుగా పేదల సంస్థలకు సమకూరిస్తే, సభ్యులు తమ సమస్యలను ప్రాధాన్య ప్రాతిపదికపై, తమ ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించుకోగలుగుతారు
4) అభివృద్ధి ప్రక్రియలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా, వీరికి మార్గదర్శనం, నిర్వహణ తోడ్పాటు, తోటి సంస్థల తీరుతెన్నులపై అవగాహన కలిగించ డానికి చక్కగా స్పందించ గలిగే ఒక సంస్థ నిరంతర మద్దతు అవసరం.

ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా రాష్ట్రాలలో సెర్ప్ సంస్థలు పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలులో యింతటి విజయాలను సాధించగలిగాయంటే, అక్కడి గ్రామీణ పేదలకు తాము పేదరికం నుంచి బయటపడాలన్న ప్రగాఢ ఆకాంక్ష, ఆ ఆశను నెరవేర్చుకోగలిగే సామర్థ్యం వుండడమే ప్రధాన కారణం. ■

# బీహార్ ఎఫ్.పి.ఓల సిబ్బందికి శిక్షణ

– జి. శ్రీనివాస్

బీహార్ రాష్ట్రంలో బి.ఆర్.యల్.పి.యస్ ఏర్పాటు చేసిన ఎఫ్ పి సి ల (రైతు ఉత్పత్తిదారుల కంపెనీల) సిబ్బందికి ఏపిమాస్ సంస్థ ప్రతినిధుల ద్వారా బీహార్ రాజధాని పాట్నాలో 2023 మార్చి 21 నుండి 22 వరకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ శిక్షణలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పాలనాపరమైన అంశాలను తెలియపరచటం జరిగింది. దాదాపు 16 మంది సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.



ఈ శిక్షణను బి.ఆర్.యల్.పి.యస్‌కు చెందిన శ్రీ దేవేష్ ఏర్పాటు చేయగా ఏపిమాస్ ప్రధాన కార్యాలయం సిబ్బంది శ్రీ జి. శ్రీనివాస్, శ్రీ వేద ప్రకాష్, బీహార్ ఏపిమాస్ సిబ్బంది శ్రీ రవి రంజన్ పాల్గొని రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మైక్రో సేవ్ సంస్థ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

తేది 24-03-2023 నాడు బి.ఆర్.యల్.పి.యస్ వారు ఉత్పత్తిదారుల కంపెనీ బలోపేతం, విజన్‌పై ఒకరోజు పాటు రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యశాలలో ప్రస్తుత రైతుఉత్పత్తిదారుల కంపెనీ స్థితిగతుల గురించి, రాబోవు సంవత్సరంలో ఒక చక్కని ప్రణాళిక గురించి చర్చించారు. ఈ కార్యశాలలో ఏపిమాస్ ప్రధాన కార్యాలయం సిబ్బంది శ్రీ జి. శ్రీనివాస్, శ్రీ వేద ప్రకాష్, బీహార్ ఏపిమాస్ సిబ్బంది శ్రీ రవి రంజన్ పాల్గొని రైతు ఉత్పత్తిదారుల కంపెనీలలో స్వయం నియంత్రణ ఉద్యమం అనే కార్యక్రమంపై వివరించారు. ఏపిమాస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో చేస్తున్న కార్యక్రమాల అమలు తీరు, సంస్థల అభివృద్ధికై పాటు పడుతున్న విషయాలను వివరించారు. సంస్థలలో స్వయం నియంత్రణ ఎంతైనా అవసరం అని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యశాలలో బి.ఆర్.యల్.పి.యస్ రాష్ట్రస్థాయి ప్రతినిధులు శ్రీ ముఖేష్ సారాన్, శ్రీ దేవేష్, రాష్ట్ర, జిల్లా అధికారులు, మైక్రో సేవ్ సంస్థ ప్రతినిధులు, ఏపిమాస్ సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు. ■

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల రుణ రాయితీ దరఖాస్తులకు ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పి ఎం ఎఫ్ ఎం ఇ) స్కీంలో భాగంగా 35% ఋణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఋణాల మంజూరు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల శాఖా జనరల్ మేనేజర్ శ్రీ బి.నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేట్ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ యువత, ఇంకా ఎవరైనా ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు.

పూర్తి వివరాలతో కూడిన తమ దరఖాస్తును ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, కరెంట్ బిల్లు, యూనిట్‌కు సంబంధించిన వివరాలతో కలిపి మండల సమాఖ్య ఏపిఎంలకు లేదా జిల్లా పరిశ్రమల కేంద్రంలో సమర్పించ వలసిందిగా ఆయన తెలిపారు. ■

సమస్యను చూసి భయపడితే అది రెట్టింపు భయపెడుతుంది, పట్టించుకోకపోతే పలాయనమవుతుంది

# దేశవాళీ ఆవు పెరుగు వుంటే యూరియాతో పనిలేదు

50 కిలోల యూరియా కంటె, 2 కిలోల దేశవాళీ ఆవుపెరుగు పొలాలకు ఎంతో మేలుచేస్తుందని సిక్కిం రాష్ట్ర అనుభవం రుజువు చేస్తున్నది.

50 కిలోల యూరియాకు బదులుగా, 15 రోజులు 2 కిలోల దేశవాళీ ఆవుపాల పెరుగులో రాగిముక్క ముంచి వుంచి, తరువాత ఆ పెరుగును వంద లీటర్ల నీటితో కలిపి, ఒక ఎకరంలో పిచికారీ చేయాలి.

ఈ పెరుగును చల్లడం ద్వారా, మొక్క వరుసగా 45 రోజులు ఆకుపచ్చగా ఉంటుంది. యూరియా 25 రోజుల మాత్రమే మొక్కను పచ్చగా ఉంచుతుంది. 2 కిలోల దేశవాళీ ఆవుపాల పెరుగుతో, 50 కిలోల యూరియా వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందో, అంతకంటే చాలా ఎక్కువ ప్రయోజనము ఉంటుంది, ఖర్చులు కూడా తగ్గుతాయి.

రైతు ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడగలుగుతాడన్న విషయం అనాదిగా మనకు తెలిసిన విషయమే. అయితే 10–15 రోజులు పులియబెట్టిన పెరుగును చిలికి నీటిని తయారుచేసిన పుల్ల మజ్జిగతో చక్కని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండించవచ్చని బీహార్ రైతులు చెబుతున్నారు. యూరియా, డీఏపీ, ఫాస్ఫేట్ వంటి ఎటువంటి రసాయనిక ఎరువుల మందులు కూడా చల్లకుండా... జీవామృతం కూడా వాడకుండా, కేవలం 'పెరుగు ఎరువు'తోనే నిశ్చింతగా అనేక ఏళ్ళుగా పంటలు పండిస్తుండడం విశేషం.

సిక్కిం రాష్ట్రం మొత్తం వ్యవసాయంలో దేశవాళీ ఆవు పాలపెరుగును చాలా సంవత్సరాలుగా ఉపయోగిస్తోంది. యూరియా సిక్కిం రాష్ట్రమంతటా నిషేధించబడింది. ■

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుబీమా పథకం !

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గతంలో వున్న 'వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం' స్థానంలో కొత్తగా పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో లబ్ధిదారుని వాటా బిపిఎల్/ఎస్సి/ఎస్టి లబ్ధిదారులకు 20%, ఏపీఎల్ లబ్ధిదారులకు 50%. గరిష్ఠంగా ఒక కుటుంబానికి 5 గేదెలకు, 50 గొర్రెలు/ మేకలు/ పందులకు బీమా చేసుకోవచ్చు.

**బీమా వివరాలు ... ఆవు లేదా గేదెలకు**

| **బీమా మొత్తం** | **లబ్ధిదారుడి వాటా** | బిపిఎల్/ఎస్సి/ఎస్టి | **వ్యవధి** |
|---|---|---|---|
| రూ.30000/– | రూ.384/– | రూ. 960/– | 3 సం.. |
| రూ.15000/– | రూ.192/– | రూ. 480/– | 3 సం.. |
| **గొర్రె లేదా మేకలకు** | | | |
| రూ.6000/– | రూ.36/– | రూ.90/– | 1 సం.. |
| రూ.6000/– | రూ.54/– | రూ.135/– | 2 సం.. |
| రూ.6000/– | రూ.75/– | రూ.187.5/– | 3 సం.. |

మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో గాని, మీ పశు వైద్యాధికారి గారిని సంప్రదించండి. ■

వెనుక చింతించడం కంటె ముందు జాగ్రత్తపడడం మంచిది

# 'పట్టు' సాగుపట్ల రైతుల్లో తగ్గుతున్న ఆసక్తి !

**ప**ట్టు పరిశ్రమ రైతుల్లో పట్టు నిలుపుకోలేకపోతున్నది. సబ్సిడీలు కల్పిస్తున్నా అంతే మొత్తంలో రైతులు కూడా పెట్టుబడులు పెట్టాల్సి రావడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. అనుకూల వాతావరణం కూడా ముఖ్యం కావడంతో రైతులు ముందుకు రావడంలేదని ఏడీఏ శ్రీ సుబ్రమణ్యం తెలిపారు. అధికారులు పట్టు సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో లోపమా లేక రైతుల్లో సాగుపై ఆసక్తి లేకపోడమో గాని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా చీమకుర్తి టీఎస్ పరిధి లోని వెలిగండ్ల, కొనకనమిట్ల, పొదిలి, కనిగిరి, మర్రిపూడి, దర్శి, చీమకుర్తితో కలిపి 7 మండలాల్లో కేవలం 32 ఎకరాల్లో మాత్రమే సాగులో ఉండడం ఇందుకు నిదర్శనం.

వెలిగండ్ల మండలంలో చౌడవరంలో 6 ఎకరాలు, కనిగిరి మండలంలోని చాకిరాలలో 3, తుమ్మ గుంటలో రెండున్నర, కొనకనమిట్ల మండలంలో ఇర సలగుండంలో 2, పొదిలి మండలం రామాపురం, మల్లవరం, నందిపాలెం గ్రామాల్లో 8, మర్రిపూడి మండలంలో మర్రిపూడి, గుండ్లసముద్రం 2, దర్శి మండలంలో పాపిరెడ్డి పాలెంలో 4, చీమకుర్తి మండలంలో చంద్రపాడు గ్రామంలో 3 ఎకరాలు సాగు చేశారు. మల్బరీ తోటలు, షెడ్ 20-50 వెడల్పులో ఏర్పాటు చేయాలంటే సుమారు రూ. 10 లక్షలకుపైగా ఖర్చు అవుతుంది. అందుకు గాను ప్రభుత్వ వాటాగా రూ. 3 లక్షలు ఇస్తుంది.

ఉపాధిహామీ పథకం ద్వారా 3 లక్షల మొక్కలకు రూ. 36 వేలు, స్టాండ్లకు రూ. 35వేలు, నేత్రికలకు రూ. 30వేలు, షెడ్డుకు ఉన్న కిటికీలకు కూలింగ్ ఏర్పాటుకు రూ. 12 500, పురుగులకు వాడే మందులకు రూ. 3500 అదనంగా ఇస్తారు. అయినా రైతుల వాటాగా రూ. 4 లక్షలు ఖర్చు పెట్టాల్సిందే. దీంతో రైతులెవరూ మల్బరీ తోటల సాగుకు ముందుకు రావడం లేదు. నాణ్యతను బట్టి రూ. 300 నుంచి రూ. 700వరకు ధర పలుకుతుందని అధికారులు చెప్తున్నారు. అయితే మొదటి సంవత్సరం మొదటి దఫాగా 200 రౌండ్ల పురుగులను పెంచడం వలన ఒకటిన్నర క్వింటాళ్ళ దిగుబడి వస్తుందన్నారు. 650 చొప్పున రూ. 97 వేల వరకు ఆదాయం వస్తుందని, ఆవిధంగా 5 దఫాలుగా 2300 రౌండ్లను సాగుచేసి, ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు.

**గ్రూపులవారీ సాగు ఎంతో మేలు**

సాగు చేసుకుంటామని ముందుకు వచ్చే రైతులకు మల్బరీ పంటపై అవగాహన కల్పించిన తరువాత ప్రోత్సహిస్తాం. పట్టు పురుగుల పెంపకం చాలా సున్నిత మైనది. పట్టు పురుగులను పెంచే ప్రాంతాల్లో ఎలాంటి రసాయన ఎరువులు, మందులు వాడే పంటలు ఉండ కూడదు. వాతావరణంపై ఆధారపడిన పైరు. సముద్రతీరానికి దగ్గర్లో మల్బరీ అంతగా సహకరించదు. మిగిలిన ఏ పంట కైనా ధరలు నిర్ణయిస్తారు. ఈ పంటకు ధర నిర్ణయించరు. నాణ్యతపైనే ధర ఆధారపడి ఉంటుంది. క్వింటాల్ రూ. 50 నుంచి రూ. 70 వేల ధర పలుకుతుంది. మిర్చి, పొగాకు, పత్తి నాటిన పొలాల మధ్యలో మల్బరీ తోటలను పెంచ కూడదు. వాటికి ఉపయోగించే మందుల వాసనకు పురుగులు చనిపోతాయి. విడివిడిగా సాగుచేయడం కంటే గ్రూపుగా ఏర్పడి సాగు చేసుకుంటే మంచిది. ఎండాకాలం వానాకాలం, చలికాలంలో పురుగులు పంటకు వచ్చినప్పుడు షెడ్డు బైటా, లోపల ఉన్న ఉష్ణోగ్రతలను సరిచూసుకోవాలి. శాఖాపరంగా సిబ్బంది కొరత ఉంది.

**–సృజయకుమార్, ఏడీఏ**

**ప్రోత్సాహం లేదు : సుబ్బారెడ్డి, గుండ్లసముద్రం**

అధికారులు, పాలకులు కేవలం టార్గెట్ల కోసం మాత్రమే రైతులతో షెడ్లు ఏర్పాటు చేయిస్తున్నారు. బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. సబ్సిడీ ఉన్నట్లు చెప్తున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. రూ. 10 నుంచి రూ. 12 లక్షలు ఖర్చుచేసి రెండున్నర ఎకరాలలో షెడ్‌ను ఏర్పాటు చేశాను. షెడ్ నిర్మాణానికి సంబంధించి కేంద్రం నుంచి రూ. 2 లక్షలు మాత్రమే అందింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారమందిస్తే ఎక్కువమంది ముందుకొస్తారు. ■

ఆనందానికి మూలం విజయం కాదు, కాని విజయ రహస్యం ఆనందమే !

# అకాల వర్షాలతో పత్తి రైతు కుదేలు !

**త**గ్గిన దిగుబడులు, పలకని ధరతో జిల్లాలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెల్లబంగారం సాగుతో నష్టాల నుంచి గట్టెక్కాలని యత్నించిన అన్నదాతలకు ఆవేదనే మిగులుతోంది. గత సంవత్సరం ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ దఫా ఎక్కువమంది సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోవటం, తెగుళ్లు అధికమవటంతో పంట దెబ్బతిని దిగుబడులు పూర్తిగా తగ్గాయి. దీనికితోడు ధర కూడా ఆశించిన విధంగా లేదు. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

- ఈ ఏడాది పత్తి సాగు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశించారు. దీంతో ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజక వర్గంలోని జలదంకి, కలిగిరి, కొండాపురం, కావలి, బిట్రగుంట, దగదర్తి, గుడ్లూరు, లింగసముద్రం, కందుకూరు తదితర మండలాల్లో మెట్టతోపాటు మాగాణి భూముల్లో దాదాపు 50 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు.
- దుక్కులు దున్నటం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పిచికారీతోపాటు కూలీలకు ఎకరాకు రూ.30 వేలకు పెట్టుబడి పెట్టారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడులు పూర్తిగా క్షీణించటంతోపాటు ధర భారీగా తగ్గింది. దీంతో సాగు పెట్టుబడులు సైతం రాక అప్పుల పాలవుతున్నామంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గతేడాది ఎకరాకు పత్తి 7నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధర క్వింటా (100 కిలోలు) రూ. 10 వేలు నుంచి రూ.12వేలకు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. దీంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది భారీవర్షాలు కురవటంతో పంట దెబ్బతింది. ఎకరాకు 2 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని, ప్రస్తుతం క్వింటా పత్తిని రూ. 8 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు.
- దిగుబడి తగ్గటంతోపాటు ధర సగానికి పడిపోయి నందున పెట్టుబడులు సైతం రాక అప్పులే మిగులుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పత్తి పంటకు మద్దతు ధర ఎం కల్పించటంతోపాటు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**వడగండ్ల వానతో నష్టం**

**గద్దె శ్రీహరి, గట్టుపల్లి :** కౌలుకు 12 ఎకరాలు తీసుకొని పత్తి సాగు చేశా. ఎకరాకు రూ. 30 వేలు వంతున 12 ఎకరాలకు రూ. 3.60 లక్షలు పెట్టుబడి పెట్టా. ఏప్రిల్లో కురిసిన వడగండ్ల వానకు కొమ్మలు విరగటంతోపాటు పూత, పిందెలు రాలి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గి ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటా పత్తి తీసేందుకు కూలీలకు రూ.1500 చెల్లిస్తున్నాం. వ్యాపారులు క్వింటా పత్తిని రూ.6 వేలుకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

**పూత, పిందె రాలాయి**

**గండు రమణారెడ్డి,గోపనపాలెం:** గత ఏడాది పత్తి సాగు ఆశాజనకంగా ఉంది. దీంతో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. అకాల వర్షాలకు పూత, పిందె రాలి పోయింది. దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఎకరాకు 3 క్వింటాళ్లు వచ్చింది. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

**ఆదుకునేందుకు చర్యలు: బి.శైలజ,వ్యవసాయాధికారిణి**

ఈ ఏడాది ఏప్రిల్లో కురిసిన వడగండ్ల వానకు వరి, పత్తి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పత్తి పంటలో ఆశించిన దిగుబడులు రావటం లేదు. పంట నష్టపోయిన రైతుల వివరాలను వీఏఏల ద్వారా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం. పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం. ■

# సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు

**సీ**నియర్ సిటిజన్లు ప్రభుత్వం అందించే అనేక ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. ఇవి ఆర్థిక భద్రతను అందించడంతో పాటు పదవీ విరమణ సంవత్సరాలలో వారికి కొంత ఖర్చుల భారాన్ని తగ్గిస్తాయి. సాధారణ పౌరుల కంటే సీనియర్ సిటిజన్లకు బ్యాంకులు కొన్ని ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నాయి. అవేంటో ఇక్కడ చూడండి.

**డిపాజిట్లపై అధిక వడ్డీ**

బ్యాంకుల్లో సాధారణ పౌరుల కంటే సీనియర్ సిటిజన్లు ఫిక్స్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలపై 0.25–0.50% వరకు అధిక వడ్డీ రేట్లను పొందేందుకు అర్హులు. ఈ అధిక రేట్లు వారి పొదుపుపై మెరుగైన రాబడిని పొందేందుకు సహాయపడతాయి. వారి పదవీ విరమణ సంవత్సరాలలో అదనపు ఆదాయ వనరులను అందిస్తాయి.

**డోర్ – స్టెప్ బ్యాంకింగ్ సౌకర్యం**

ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం, సీనియర్ సిటిజన్లు వికలాంగులకు నగదు తీసుకోవడం లేదా చెక్కు, డిమాండ్ . డ్రాఫ్టును అందించడానికి బ్యాంకులు బాధ్యత వహించాలి. 70 లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న సీనియర్ సిటిజన్లకు కేవైసీ, నగదు డిపాజిట్, ఉపసంహరణ మొదలైన ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ఆర్బీఐ నిబంధనలను రూపొందించింది. డోర్ – స్టెప్ బ్యాంకింగ్ బ్యాంకులు అనేక సౌకర్యాలను అందిస్తున్నాయి. అయితే, సీనియర్లు ఆన్లైన్ లేదా డోర్– స్టెప్ సేవలను పొందేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకింగ్ సేవల కోసం ఏదైనా నగదు లేదా పత్రాలను అందజేసే ముందు ఆర్థిక సంస్థ. (ఇంటి వద్ద సర్వీసు అందించే) వ్యక్తికి సంబంధించిన ప్రామాణికతను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి.

**పన్ను ప్రయోజనాలు**

సీనియర్ సిటిజన్లు అధిక పన్ను మినహాయింపులు, తక్కువ పన్ను రేట్లతో సహా వివిధ పన్ను ప్రయోజనాలకు అర్హులు. వీరికి పన్ను మినహాయింపు పరిమితి సాధారణ పౌరుల కంటే ఎక్కువగా ఉంటుంది. వైద్య బిల్లులు, ఆరోగ్య బీమా ప్రీమియంలు, నిర్దిష్ట పథకాలలో పెట్టుబడి వంటి ఖర్చుల కోసం తగ్గింపులను క్లెయిమ్ చేయవచ్చు.

**ప్రభుత్వ పథకాలు**

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం 8.20% వడ్డీతో, ప్రధాన మంత్రి వయ వందన యోజన (పీఎంవీవీవై) 7.40% వడ్డీతో సీనియర్ సిటిజన్ల కోసం ఇలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి కేంద్ర ప్రభుత్వ హామీ ఉండే పథకాలు కాబట్టి గ్యారంటీయే కాకుండా అధిక వడ్డీని కూడా పొందొచ్చు.



**ఆరోగ్య బీమా**

సాధారణంగా, సీనియర్ సిటిజన్లు అనారోగ్యాలకు ఎక్కువగా గురవుతారు. వీరికి క్రమంతప్పకుండా వైద్య సంరక్షణ అవసరం. సీనియర్ సిటిజన్ల అవసరాలకు ప్రత్యేకంగా అనేక ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పథకాలు వైద్యపరమైన అత్యవసర సమయాల్లో సమగ్ర కవరేజీని అందిస్తాయి.

**ప్రజా రవాణా**

అనేక రాష్ట్ర రోడ్ రవాణా సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రయాణాల్లో రాయితీ ధరలను అందిస్తున్నాయి. రవాణా ఛార్జీల్లో రాయితీలు 50% వరకు కూడా ఉంటున్నాయి. ఈ రాయితీ సీనియర్ సిటిజన్లకు ఆర్థికంగా ఉపశమనంగా ఉంటుంది.

గమనిక: సీనియర్ సిటిజన్ల పథకాల అర్హతకు వారి వయసు ధ్రువీకరణ పత్రం అవసరం.

(ఈనాడు సౌజన్యంతో)

■

# విశాఖలో మహిళలకు పారిశ్రామిక శిక్షణ

అందుబాటులోని వనరులను వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. స్వయంగా వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. మరికొందరు –సరైన నైపుణ్యాలు, అవకాశాలు లేక ముందుకు వెళ్లలేకపోతున్నారు. అలాంటి వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐ ఎల్ ఓ) కృషి చేస్తోంది. ఐ ఎల్ ఓ ఆధ్వర్యంలో కొరియా దేశానికి చెందిన 'కొయికా' (కొరియా ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ) మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**విశాఖలో మాత్రమే**

తీర ప్రాంతంలోని మహిళలకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో శిక్షణ ఇవ్వాలని ఐ ఎల్ ఓ ప్రతినిధులు భావించారు. అందుకు విశాఖ అనువుగా ఉంటుందని ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఈ శిక్షణకు ఎంపికైన ఏకైక ప్రాంతం ఇదే. నగర పరిసర ప్రాంతాల్లోని ఔత్సాహిక మహిళలు ఈ శిక్షణ తీసుకోవచ్చు. కార్యనిర్వహణ, పర్యవేక్షణ, ఇతర బాధ్యతలను కొయికా సంస్థ 'ఎలీప్' (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఏపీ) సంస్థకు అప్పగించింది.

**నైపుణ్యాలు.. మెలకువలు**

విశాఖలో నాలుగు దశల్లో వందమందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే బ్యాచ్‌కు 25 మంది చొప్పున మూడు దశల్లో 75 మందికి 'ఫుడ్ ప్రాసెసింగ్'లో శిక్షణ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలుగా స్థిరపడాలనుకునే మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలను వివరిస్తున్నారు.

10 రోజులపాటు ఆహార పదార్థాల నిల్వ, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాల్లో మెలకువలు నేర్పించారు. ఇంకా వ్యాపార నైపుణ్యాలు, మార్కెట్లో అవకాశాలు తదితరాలను వివరించారు. త్వరలో నాలుగో బ్యాచ్ దుస్తులకు సంబంధించిన శిక్షణ ప్రారంభం కానుంది. వ్యాపారం ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు, బ్యాంకుల నుంచి రుణాలు పొందే ప్రక్రియలో ఎలీప్ ప్రతినిధులు సహకరిస్తారు. బయటి నుంచి ఆర్డర్లు వస్తే శిక్షణ పొందిన మహిళలతో తయారుచేయించి వారి వ్యాపారాన్ని ప్రోత్సహిస్తారు.

**ఎంపిక ప్రక్రియ ఇలా ...**

శిక్షణకు సంబంధించి ముందుగా ఎలీప్ ప్రతినిధులు ఔత్సాహిక మహిళలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.



అందులో ఎంపిక చేసిన దరఖాస్తులను ఐ ఎల్ ఓ ప్రతినిధులకు పంపిస్తారు. అక్కడున్న ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు వారందరితో ఫోన్లో మాట్లాడతారు. వారి వ్యాపార అభిరుచులు, సొంతంగా వ్యాపారం పెట్టుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారా లేదా తెలుసుకుంటారు. అందులో నుంచి 25 మందిని ఎంపికచేసి శిక్షణ ఇస్తారు.

**స్పందన బాగుంది: అజయ్ బాబు, సంచాలకులు, ఎలీప్**

ఇప్పటికే మూడు బ్యాచుల్లో 75 మందికి శిక్షణ పూర్తయింది. వారిలో 30 మంది సొంతంగా వ్యాపారం ప్రారంభించడానికి ముందుకొచ్చారు. కొందరు ఇప్పటికే ప్రారంభించగా మరికొందరు సన్నాహాలు చేస్తున్నారు. వారికి తగిన సహకారం అందిస్తున్నాం. ఈ కార్యక్రమానికి స్పందన బాగుంది. ■

ప్రతి సమస్యకు ఎన్నో పరిష్కారాలు , నీకు తెలిసినవి అనేకం వున్నా తెలియనిది ఒక్కటైనా వుంటుంది

# పంటల మార్పిడి వ్యూహంతో రైతులకు అవగాహన !

రైతులు వేసిన పంటలే మళ్లీ వేయడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. చాలామంది నేటికీ ఒకేరకమైన పంటలను పండిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏటేటా పంట మార్పిడి చేస్తే దిగుబడులు పెరగడంతోపాటు నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది. భూసారం వృద్ధి చెందుతుంది. చీడపీడల బెడద తగ్గుతుంది. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే పురుగుల మందు ఖర్చు తగ్గుతుంది. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉన్నది. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వ్యవసాయ రంగంలో పంట మార్పిడి విధానంతో పురుగుల ఉధృతి తగ్గడమే కాకుండా భూసార సంరక్షణ,



పోషక లోపాల నివారణ జరిగి రైతులు అధిక దిగుబడులు పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చాలామంది రైతులు దీన్ని పాటించకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రతి ఏటా పంట మార్పిడి విధానాన్ని అవలంబించినట్లయితే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే వీలు ఉంటుంది. భూమిలోని పోషకాలు సమృద్ధిగా అందుతాయి. ఈ విషయాలన్నింటినీ వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎప్పుడూ ఒకే పంటను పండించడంతో పురుగులకు నిరంతరం ఆహారం లభ్యమై వాటి జీవిత చక్రం పునరావృతం అవుతూ వాటి సంతతి పెరుగుతుంది. దీంతో పంటలకు చీడ, పీడల బెడద ఎక్కువవుతున్నది. ఒకే పంట పండించడంతో ఆ పంట వేర్లు నేలలో వ్యాపించి పోషకాలను గ్రహించడంతో కొన్ని రోజులకు ఆ మట్టి పొరలు విస్తారం అవుతాయి. అలాంటి నేలల్లో వేసే పంటల దిగుబడులు తగ్గిపోనున్నాయి.

వివిధ వేరు వ్యవస్థ కలిగిన పత్తి, కంది, వంటి పంటలు, మామూలు వేరు వ్యవస్థ గల (స్వల్ప, లోతుకు చొచ్చుకు పోయే) వరి, వేరుశనగ వంటి పంటలతో మార్పిడి చేయాలి. నీటి వసతి సరిగా లేని ప్రాంతంలో ఒక పంటను పూర్తి నీటి వసతితో పండించి 2వ పంటను వర్షాధారంగా వేసుకుంటే నీటి వినియోగం సమర్థవంతంగా జరుగుతుంది.

మిరప, టమాట, వేరుశనగ పంటలను ఆశించే లద్దె పురుగు నివారణకు జొన్న, వరి, సజ్జ, రాగి పంటలతో మార్పిడి చేసుకోవాలి. పంట మార్పిడి చేయడంతో పొలంలో పురుగులు, ప్రాణాంతక తెగుళ్లు వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి. పంట మార్పిడి చేయడంతో నేలలోని మట్టి సారవంతమవడంతో పాటు మట్టి ఉత్పాదకత స్థిరంగా కాపాడుకోవచ్చు.

**పంట మార్పిడి విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- ➩ వరిని ఆశించే కాండం తొలుచు పురుగు, ఆకు మచ్చ తెగులు నివారణకు అపరాలతో పంట మార్పిడి చేసుకోవాలి. దీంతో పురుగుల ఉధృతి తగ్గడమే కాకుండా నత్రజని స్థిరీకరించబడి తర్వాత వేసే పంటకు పనికి వస్తుంది.
- ➩ నులిపురుగుల బెడద ఉన్నప్పుడు నువ్వు, బంతి, ఆవాలతో పంటమార్పిడి చేస్తే వాటి ఉధృతి తగ్గుతుంది.
- ➩ జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు పొద్దుతిరుగుడు, వేరుశనగలతో పంట మార్పిడి చేసుకోవాలి.
- ➩ టమాటాలో వడ తెగుళ్లు, లద్దె పురుగుల నివారణకు పెసర, జొన్న, వరి, సజ్జ పంటలను వేసుకోవాలి.

➪ పత్తిలో గులాబీ రంగు కాయ తొలుచు పురుగు, లద్దె పురుగు వంటి వాటి నివారణకు అపరాలు, జొన్న, మక్కజొన్నలో ఎర్ర కుళ్లు, వడలు, తెగులు నివారణకు జొన్నతో పంట మార్పిడి చేయాలి.

➪ పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.

➪ శనగ, బొబ్బర, పెసర, మినుము పంటలను వేసుకోవడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను నివారించుకోవచ్చు.

**పంటల మార్పిడితో ప్రయోజనాలివే..**

➪ నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.

➪ భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.

➪ చీడ పీడలు, క్రిమికీటకాలు పంటలకు దూరమవుతాయి.

➪ సస్యరక్షణకు వినియోగించే పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది.

➪ పంటలకు శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.

➪ పంటలకు బీజాలు వంటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువవుతుంది.

➪ కీటకాల గుడ్లు వృద్ధి చెందే అవకాశాలు తగ్గుతాయి.

➪ పంటలో నాణ్యత పెరిగి దిగుబడి ఎక్కువగా పొందే అవకాశాలు ఉన్నాయి.

**ఈ విధానంలో చేయనివి..**

➪ జొన్న పంట సాగు చేసిన పొలంలో మిరపను వేయవద్దు.

➪ వేరుశనగను మళ్లీ సాగు చేస్తే ఎర్ర గొంగళి పురుగు, శనగపచ్చ పురుగులు ఆశిస్తాయి.

➪ నులి పురుగు ఉన్న ప్రాంతాల్లో వంగ, బెండ, టమాట, ఉలువలు, మినుములు, పెసర పంటలు వేస్తే అవి వాటిని మరింత వృద్ధి చేస్తాయి. అందువల్ల ఆ పంటలను సాగు చేయవద్దు. ■

## పొలాల్లోనే కుళ్ళిపోయిన ఉల్లి !

**తె**లంగాణలో ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. డిమాండు దృష్ట్యా రాష్ట్రంలో ఉల్లిసాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న తరుణంలో అకాల వర్షాలు వారి ఆశలను తుంచేశాయి. మార్చి నుంచి కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 65 వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతోంది. ఇందులో యాసంగి పంట 38 వేల ఎకరాల్లో ఉంది. వరుస వానలతో దాదాపు 25 వేల ఎకరాల్లోని ఉల్లిగడ్డలు పొలంలోనే కుళ్లిపోయాయి. అధిక ధరలకు విత్తనం కొని, ఎరువులు వేసి, చీడపీడలు ఎదుర్కొని పంటను కాపాడుకుంటే... చేతికొస్తున్న తరుణంలో ఆకాల వర్షాలు నట్టేటముంచాయి.

ప్రధానంగా వికారాబాద్, రంగారెడ్డి, గద్వాల్, మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, ఖమ్మం, సూర్యాపేట, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఉల్లి సాగవుతోంది. సగానికి పైగా కుళ్లిపోయిన తరుణంలో మళ్లీ మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్ర అవసరాల దృష్ట్యా ఉల్లిసాగును గణనీయంగా పెంచడానికి ప్రభుత్వం యత్నిస్తోంది. వరి తదితర పంటలకు ప్రత్యామ్నాయంగా దీనిని ప్రోత్సహిస్తోంది. ఈ చర్యలతో మూడేళ్లుగా కొంత మేర సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది అనూహ్యంగా పంట దెబ్బతినడంతో మళ్లీ ఉల్లి వేయాలంటే రైతుల్లో ఆందోళన నెలకొంది.లో భారీ వర్షం నష్టాలు మిగిల్చింది.

రాష్ట్రంలో ప్రతి నెల తలసరి ఉల్లి వినియోగం 1.05 కిలోలు.

ఏటా వినియోగం : 4,39,953 టన్నులు.

ప్రస్తుతం సాగవుతోంది : 65 వేల ఎకరాలు

ఉత్పత్తి : 2,78,540 టన్నులు

వినియోగానికి కొరత : 1,61,413 టన్నులు ■

# ఖరీఫ్ పెసర రకాలు ... సాగులో మెళకువలు

**ఖ**రీఫ్‌లో వర్షాధారంగా తక్కువ పెట్టుబడి, తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే అపరాలలో పెసర ముఖ్యమైనది. ఈ పంట సాగుతో భూసారం పెరగడంతో పాటు తరువాత వేసే పంటకు నత్రజని అధికంగా లభిస్తుంది. ప్రస్తుతం భూములను దున్ని, సాగుకు సిద్ధమవుతున్నారురైతులు. ఈ నేపథ్యంలో పెసర సాగుకు అనువైన రకాలు, యాజమాన్యం గురించి తెలుసుకుందాం.


పెసర వర్షాధారపు పంట. కాని వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఒకటి, రెండు నీటితడులు ఇస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. పెసరకు 25 నుండి30 రోజులదశలో ఒకసారి, 45 నుండి 50 రోజుల దశలో మరోసారి తేలికపాటి తడులు ఇవ్వాలి. పూతదశలో నీటితడులు ఇవ్వకూడదు.

పెసరపంటను వర్షాధారంగా, నీటి పారుదల కింద 3 కాలాల్లోను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం స్వల్పకాలపు పంటైనా ెసరను సాగు చేయటానికి అత్యంత అనుకూలమైన సమయం. ఉత్తర తెలంగాణా, దక్షిణ తెలంగాణా, తక్కువ వర్షపాత మండలాల్లో జూన్ 15 నుండిజులై 15 వరకు, కృష్ణా , గోదావరి, దక్షిణ మండలం, ఉత్తరకోస్తా మండలాల్లో జూన్, జూలై నెలల్లో పెసరను విత్తుకోవచ్చు. పెసరను అన్నిరకాల భూముల్లో సాగు చేయవచ్చు. కాని చౌడు నేలలు ,మురుగునీరు నిలిచే నేలలు పనికి రావు.

**నేలతయారి**

పెసరసాగుకు నేల తయారి చాలాముఖ్యం. ఒకసారి నాగలితోను, రెండుసార్లు గొర్రుతోనే మెత్తగా దున్ని గుంటక తోలి నేలను తయారు చేయాలి. వరికోసిన పొలాల్లో దుక్కి దున్నవలసిన అవసరం లేదు. తొలకరిలో ఎకరాకు విత్తనం 6 నుండి 7 కిలోలు సరిపోతుంది. విత్తనాన్ని విత్తేముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 2.5 గ్రాముల థైరామ్తో5 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్లేదా 5 గ్రాముల థయోమిథాక్సామ్‌తో కలిపి విత్తనశుద్ధి చేసినట్లైతే 15 నుండి 20 రోజుల వరకు తెగుళ్ళు, రసంపీల్చే పురుగుల బారినుండి పంటను రక్షించుకోవచ్చు. ఈ పైరును కొత్తగా పండించేటప్పుడు రైజోబియం కల్చరును విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు.

ముఖ్యంగా ఖరీఫ్‌కు అధిక దిగుబడులను ఇచ్చే అనువైన పలురకాలు ఉన్నాయి. తెలంగాణ నుండి విడుదలైన రకాలు ఎం.జి.జి - 295 రకం పంటకాలం 60 నుండి 65 రోజులు. ఈ మొక్కలు నిటారుగా పెరుగుతాయి. కాపు మొక్క పై భాగానే ఉండి గింజ మధ్యస్థ లావుగా, సాదాగా



ఉంటుంది. ఎకరాకు 5 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. నల్లమచ్చ తెగులును తట్టుకొంటుంది. మొవ్వ కుళ్లుతెగులును కొంతవరకు తట్టుకుంటుంది.

**పచ్చిరొట్ట పైర్లు... ఉపయోగాలు**

మరో రకం డబ్ల్యు.జి.జి-37. ఈ రకం పంటకాలం కూడా 60 నుండి 65 రోజులు. గింజ ఆకర్షణీయంగా పచ్చగా మెరుస్తుంది. రాష్ట్రమంతటా అన్నికాలల్లో పండించడానికి అనుకూలమైనది. ఎకరాకు 5 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. ఎల్లోమోజాయిక్ తెగులు తట్టుకుంటుంది

టి.ఎం-96-2 పంటకాలం 60 నుండి 65 రోజులు

కుటుంబ సభ్యులపట్ల ఓర్పు ప్రేమకు చిహ్నం, ఇతరుల పట్ల ఓర్పు గౌరవానికి సంకేతం

రబీ, వేసవి, మెట్ట, మగాణిల్లో వేసుకోవచ్చు. ఎకరాకు 4 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. అధిక తేమను, బూడిద తెగులును తట్టుకుంటుంది. గింజలు లావుగా మెరుస్తుంటాయి.

ముఖ్యంగా వరి మాగాణులకు అనువైన రకం. యం.జి.జి – 348. భద్రాద్రి పేరుతో కూడా పిలుస్తారు. ఈ రకం పంటకాలం 65 రోజులు. ఖరీఫ్, రబీకి అనువైన రకం. ఎకరాకు 4 నుండి 5 క్వింటాల దిగుబడి వస్తుంది. మొక్క పొట్టిగా ఉండి అంతర పంటకి అనుకూలం. రబీ సాగుకు అత్యంత అనుకూలమైనది. బెట్టను కొంతవరకు తట్టుకుంటుంది.

**అందుబాటులో అధిక దిగుబడినిచ్చే రకాలు**

యం.జి.జి – 347 . మధిర నుండి విడుదలైన ఈ రకం పంటకాలం 65 నుండి 70 రోజులు. ఎకరాకు 4 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరుగుతాయి. కాయ మొక్క పైభాగాన ఉండి, గింజ లావుగా, సాదాగా ఉంటుంది. మొవ్వ కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది.

యం.జి.జి – 42. ఖరీఫ్, రబీ, వేసవి కాలాలకు అనువైన రకం. ఎకరాకు 4 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. పొడవైన కాయలు కలిగి, లావు మెరుపు గింజలు ఉంటాయి. పల్లాకు తెగులు తట్టుకుంటుంది. ముఖ్యంగా పత్తిలో అంతర పంటగా అనువైన రకం.

ఆంధ్రప్రదేశ్ నుండి విడుదలైన రకాలు ఎల్.జి.జి – 407. ఈరకం మూడు కాలల్లోనే సాగు చేసుకోవచ్చు. పంట కాలం 65 నుండి 70 రోజులు. పల్లాకు, నల్ల, ఆకుమచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. బెట్టను కూడా కొంతవరకు తట్టుకుంటుంది.

**కలుపు నివారణ**

పెసర సాగులో కలుపు నివారణ కూడా కీలకమే. పెండిమెథాలిన్ 30% ఎకరాకు 1.3 నుండి–1. 6 లీటర్లు లేదా అలాక్లోర్ 50% ఎకరాకు లీటరు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గాని పిచికారి చేయాలి. విత్తిన 20, 25 రోజులప్పుడు గొర్రుతో అంతర కృషి చేయాలి. మాగాణి పెసరలో ఊద నిర్మూలనకు ఫెనాక్సాప్రాప్ ఇథైల్ 9% ఎకరాకు 250 మి.లీ. చొప్పున 200 లీ. నీటిలో కలిపి విత్తిన 20, 25 రోజులప్పుడు పిచికారి చేయాలి. ఊదతో పాటు చిప్పెర గరిక లాంటి గడ్డిజాతి కలుపు ఉంటే క్విజలో ఫాఫ్ ఇథైల్ 5% 400 మిల్లీలీటర్లు పిచికారి చేయాలి. వెడల్పాకు కలుపు ఉన్నట్లైతే, రెండు ఆకుల దశలో ఎకరాకు ఇమజితాఫిర్ 200 మిల్లీలీటర్లు పిచికారి చేయాలి.

**పెసర, మినుము పంటలలో శనగపచ్చ పురుగు, కాండపు ఈగ నివారణ!**

ఎల్. జి. జి–460. ఈ రకం పంటకాలం కూడా 65 నుండి 70 రోజులు. ఎకరాకు 5 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. కాయలు గుత్తులు గుత్తులుగా పై భాగంలో ఉండి కోయడానికి సులువుగా ఉంటుంది. ఒకేసారి కోతకొస్తుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. మొవ్వుకుళ్లు



తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. వరి మాగాణులకు అనువైన రకం.

ఎల్. జి. జి –450. ఈ రకం పంటకాలం కూడా 65 నుండి 70 రోజులు. ఎకరాకు 5 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. కోత సమయంలో వర్షాలు కురిసినా కాయల్లోని గింజలు కొంతవరకు పాడవకుండా ఉంటాయి.

ఎల్. జి. జి –410. ఈ రకం పంటకాలం కూడా 65 నుండి 70 రోజులు. ఎకరాకు 5 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. ఒకేసారి కోతకు వస్తుంది. వరి మాగణులకు అనువైన రకం.

ఐ.పి.యం – 2–14. ఈ రకం పంటకాలం కూడా 65 నుండి 70 రోజులు. ఎకరాకు 4 నుండి 6 క్వింటాల దిగుబడి వస్తుంది. మొక్క నిటారుగా పెరిగి ఒకేసారి కోతకు వచ్చే రకం. గింజలు మధ్యస్థ లావుగా మెరుస్తుంటాయి. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ■

కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# క్యూఆర్ కోడ్‌తో నకిలీ విత్తనాలకు చెక్

**నాణ్యమైన విత్తనాల అభివృద్ధి ద్వారానే దేశంలో వ్యవసాయ రంగం పురోగమిస్తుందని జాతీయ విత్తన పరిశ్రమల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా) డైరెక్టర్ జనరల్ రామ్‌కౌండిన్య తెలిపారు. ప్రస్తుత విత్తన విధానాలు ప్రగతిశీలకంగా లేవని చెప్పారు. పత్తిలో నూతన వంగడాలను ప్రోత్సహించకపోవడం వల్ల, ఇప్పుడు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమగ్ర మార్పుల కోసం దేశంలో నూతన విత్తన చట్టం రావాలని, విస్తృతస్థాయిలో పరిశోధనలు జరగాలని, రైతు సంక్షేమ కోణంలో విప్లవాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. విత్తనరంగ పరిస్థితులను "ఈనాడు" ఇంటర్వ్యూలో ఆయన వివరించిన విశేషాలు ఈనాడు సౌజన్యంతో ' మహిళా సాధికారత' పాఠకులకోసం అందిస్తున్నాం.**

**దేశంలో విత్తనరంగ పరిమాణం ఎంత?**

దేశీయ విత్తనరంగంలో అధీకృత విపణి విలువ రూ. 23,000 కోట్లుగా ఉంది. ఇందులో రూ.6500 కోట్లు కూరగాయల విత్తనాలు కాగా, మరో రూ. 4000 కోట్లు పత్తి, రూ.2510 కోట్లు వరి, రూ.2500 కోట్లు జొన్న, రూ.2100 కోట్ల సోయా, రూ.1000 కోట్లు గోధుమ, రూ.900 కోట్ల మిర్చి విత్తనాలు అమ్ముడవుతున్నాయి. అనధికారిక విపణి మరో రూ. 5 వేల కోట్ల మేర జరుగుతోందని అంచనా. విత్తనాల అమ్మకాలు ఏటా 7% పెరుగుతున్నాయి. ప్రపంచం లోనే అత్యధికంగా సాగుకు అనువైన 45,000 కోట్ల ఎకరాల సాగు భూమి మన దేశంలో ఉంది. సాగు విస్తీర్ణం పెరిగితే విత్తనఅమ్మకాలు అధికమవుతాయి. విత్తన మార్కెట్లో అమెరికా, అర్జెంటీనా, బ్రెజిల్, ఫ్రాన్స్ తొలి 4 స్థానాల్లో ఉన్నాయి.

**నకిలీ విత్తనాలు బెడద ఎలా ఉంది?**

మార్కెట్లో 17- 18% అనుమతి లేని విత్తనాలున్నాయి. నాసిరకం, కల్తీ విత్తనాల నిరోధానికి, ప్యాకెట్‌పై కొత్తగా క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి వచ్చింది. దీనిని స్కాన్ చేస్తే విత్తన కంపెనీ, తయారీ తేదీ, నాణ్యత వంటి వివరాలు వస్తున్నాయి. పంపిణీదారు నుంచి రిటైలర్ వరకు ఎప్పటికప్పుడు స్కానింగ్ చేశాకే రైతుకు విక్రయించాలి.

**విత్తన రంగంలో ఎలాంటి సమస్యలున్నాయి.**

మన దేశంలో విత్తన రంగంపై అనేక ఆంక్షలున్నందునే, కొత్త పరిశోధనలకు పెట్టుబడులు ఆశించిన మేర రావడం లేదు. పత్తిలో బీటీ1, బీటి 2 వచ్చాయి. బీటీ 3 రావాల్సి ఉంది. పురుగుమందులు, కలుపుని నివారించే బీటీహెచ్‌టీ రకం వచ్చినా, దానికి ఇంకా అనుమతులు రాలేదు. పత్తి ఉత్పత్తి తగ్గినందునే దాదాపు 20 ఏళ్ల తర్వాత మళ్లీ విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వరి, మిర్చి, మొక్కజొన్న లోనూ కొత్త వంగడాలు పెరగాలి. వంట నూనెల్లోనూ ఇంతే.

**వరిసాగు ప్రయోజనకరంగా ఉందా**

దేశంలో 55% సాగునీటి వినియోగం జరిగేది వరితోనే. దాదాపు 10 కోట్ల ఎకరాల్లో వరి పండుతోంది. కిలో ధాన్యం ఉత్పత్తికి 5 వేల లీటర్ల నీరు వాడుతున్నారు. దేశంలో ఎక్కడ నీటిపారుదల సామర్థ్యం పెరిగినా, అక్కడ వరి సాగు చేస్తున్నారు. గోధుమ మాదిరిగానే వరిలోనూ నేరుగా విత్తి పండించే వంగడం తయారైంది. ఇందువల్ల నీరు ఆదా అవుతుంది. దేశీయ అవసరాలకు అనుగుణంగా నూనెగింజల దిగుబడి పెంచాలి. ప్రస్తుతం ఏటా రూ. లక్ష కోట్ల వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్నాం.

**తెలుగు రాష్ట్రాల్లో విత్తన రంగం ఎలా ఉంది.**

తెలుగు రాష్ట్రాల్లో రైతులు కొత్త వంగడాలు వాడుతున్నారు. విత్తన సంస్థలతో పాటు రైతులూ విత్తనాల తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణలో కోటి ఎకరాల మేర సాగు జరుగుతోంది. పత్తి, తదితర రంగాల్లో పరిశోధనలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

# అరటి రైతుల లిచీ పండ్ల సాగు ... భారీ లాభాలు !



**లి**చీ పండ్లు అరుదైనవి. దిగుబడి తక్కువ. ధర చాలా ఎక్కువ. ఆరోగ్యానికి ఎంతో మంచివి. మందులు, చాక్లెట్ల తయారీలోనూ వాడుతారు. అలాంటి పండ్ల వ్యవసాయం ఇప్పుడు ఇండియాలో బయటకు తెలియకుండా జరిగిపోతున్నది.

లిచీ పండ్లకు ఇప్పటివరకూ చైనా ఫేమస్. ప్రపంచంలో చాలా దేశాలు చైనా నుంచి ఆ పండ్లను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇప్పుడు సీన్ మారుతోంది. ఇండియా కూడా లిచీ పండ్లను పండిస్తోంది. ఇందుకు ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో కేరాఫ్ అవుతోంది. అక్కడి బారాబంకీ జిల్లాలో... సంప్రదాయ అరటి రైతులు.. అరటి బదులు ఇప్పుడు లిచీ పండ్ల సాగు చేస్తూ.. భారీ లాభాలు పొందుతున్నారు.

లిచీ పండ్ల గురించి మన దేశంలో చాలామందికి తెలియదు. వీటి రేటు ఎక్కువ. కేజీ రూ. 300 నుంచి రూ. 400 దాకా పలుకుతాయి. అందుకే సాధారణ ప్రజలు వీటిని కొనుక్కోరు. కానీ బారాబంకీ జిల్లాలో వీటిని రైతులు కాస్త తక్కువ ధరకే అమ్ముతున్నారు. దాంతో... యూపీ వ్యాప్తంగా వ్యాపారులు వాటిని కొనుక్కుంటున్నారు. స్థానికంగా సోర్ లిచీ ఫేమస్ అయ్యింది.

బారాబంకీ జిల్లాలోని జైద్‌పూర్ పట్టణంలో 2-3 ఎకరాల్లో ఓ లిచీ తోటను బడే సర్కార్ అనే రైతు పదేళ్లుగా సాగు చేస్తూ, జ్యూసీ లిచీ పండ్లను పండిస్తున్నాడు. ఈ పండ్లు పుల్లగా, తియ్యగా ఉంటున్నాయి. ఈ రుచిని స్థానికులు బాగా ఇష్టపడుతున్నారు. యూపీతో పాటు ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి లీచీ కొంటున్నారు. ఈ సాగులో ఏడాదికి రెండుసార్లు అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

జనవరి-ఫిబ్రవరి మధ్యలో లిచి చెట్టుకు ముందుగా మందులు, ఎరువులు వేయాలి. అలాగే.. ఏప్రిల్ నెలలో పువ్వులు, పండ్లు వచ్చినప్పుడు కూడా పండ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. వారానికి రెండుసార్లు నీరు పొయ్యాలి. మే మధ్యలో పండ్లు పండి, కోతకు వస్తాయి. ■

---

**సాగులో విత్తన వ్యయం ఎంత ?**

సాగు వ్యయంలో విత్తనాలకు 5% కంటే తక్కువే వెచ్చిస్తున్నారు. అధిక దిగుబడుల సాధనతో పాటు నాటడం, కలుపు తీయడం, కోతల సమయంలో యంత్రాల వినియోగానికి వీలుగా విత్తన రకాలుండాలి. ఇందుకోసం మా సమాఖ్య తరపున కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫారసులు చేశాం. కొత్త వంగడాల అభివృద్ధికి పరిశోధనలు పెంచడంతో పాటు పెట్టుబడులను ఆహ్వానించాలి. సాంకేతికతకు పెద్దపీట వేయాలి. విత్తన ధరలపై నియంత్రణను సడలించాలి. వాతావరణ మార్పులను తట్టుకునేలా కొత్త వంగడాలను రూపొందించాలి.

జాతీయ విత్తనబిల్లు గత పదేళ్లుగా పెండింగులో ఉంది. పారదర్శకతకు దోహదపడే దానిని వెంటనే ఆమోదించాలి. ఈ బిల్లు ప్రకారం.. ప్రతి సంస్థ తాము విక్రయించే ప్రతి వంగడాన్ని నమోదు చేయాలి. తద్వారా నాణ్యతతో పాటు ప్రమాణాలను పాటించే అవకాశం ఉంది. ■

# తెలంగాణాలో పెరగనున్న పత్తి సాగు !

తెలంగాణలో అన్నదాతలు వానకాలం సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాధార పంటలు సాగుచేసే రైతులు ఇప్పటికే పొలాలను దుక్కి దున్ని చదును చేస్తున్నారు. రోహిణికార్తె తర్వాత కురిసే వర్షాల ఆధారంగా నాట్లు వేయనున్నారు. పంటల సాగు అంచనా మేరకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో వానకాలం సీజన్‌లో 5.94 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు భావిస్తున్నారు. గతేడాది కంటే ఈసారి 18 శాతం అధికంగా సాగు కావొచ్చని అంచనా. పత్తిని అత్యధికంగా 3,63,635 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏఈవోలు కర్షకులకు సలహాలు, సూచనలిస్తున్నారు.

**వానాకాలానికి సంసిద్ధం**

వానాకాలం పంటల సాగుకు అధికారుల అంచనాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ ఆదేశంతో జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు ఈ సీజన్‌లో రైతులు పండించే పంటలపై నివేదికలు రూపొందించారు. రైతులు ముందస్తుగా సేద్యం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా క్షేత్ర పర్యటనల తర్వాత రైతువేదికల్లో ఏఈవోలు ప్రతిరోజూ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండనున్నారు. వారానికి రెండుసార్లు రైతులకు విత్తినప్పటినుంచి పంట మార్కెట్‌కు తరలించే వరకు అవసరమైన సలహాలు, సూచనలు అందించనున్నారు. సింగిల్ విండోల ద్వారా మార్కెట్‌లో రైతులకు అవసరమైన విత్తనాలను కూడా అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఈ సీజన్‌కు సంబంధించి రైతుబంధు నిధులను కూడా త్వరలోనే ఖాతాలో జమ చేయనున్నది. ఇలా ప్రభుత్వం వానాకాలం సాగుకు చర్యలు తీసుకుంటుండగా అన్నదాతలు సైతం సేద్యానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో భూములు చల్లబడ్డాయి ఈసారి ముందస్తు వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ సూచనలతో రైతులు వానాకాలం ప్రారంభంలోనే విత్తేందుకు సిద్ధమై భూసార పరీక్షలు చేయిస్తున్నారు. పప్పు, నూనె గింజ పంటల సాగు చేపట్టాలని రైతులకు ఏఈవోలు వివరిస్తున్నారు.

**పత్తి సాగుకు రైతుల మొగ్గు..**

నాగర్‌కర్నూల్ జిల్లాలో 13లక్షల ఎకరాల భూములు ఉండగా.. వానకాలంలో 5,94,198 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. 2020 వానకాలంలో 6,13,878 ఎకరాల్లో సాగు చేయగా, 2021లో 5,44,433 ఎకరాల్లో, 2022లో 4,92,055 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి గతానికంటే 18శాతం అధికంగా సాగు చేయొచ్చని అధికారుల అంచనా. కాగా ప్రధానంగా పత్తిపంటను 3,63,635 ఎకరాల్లో సాగు కానుంది. ఆ తర్వాతి స్థానంలో వరి 1,29,710 ఎకరాల్లో, మొక్కజొన్న 41,564 ఎకరాల్లో, కందులు 4,613 ఎకరాల్లో, జొన్న 2,515 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా.

**పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగు మేలు**

ఈ వానకాలంలో పంటల సాగు ప్రణాళికను తయారు చేశామని, పప్పు, నూనెగింజల పంటలు సాగుచేయాలని రైతులకు ఏఈవోల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు నాగర్‌కర్నూల్ డీఏఓ శ్రీ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో 5.94లక్షల ఎకరాలకుగానూ అత్యధికంగా 3.63లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, రైతులు భూములను దున్ని సిద్ధంగా ఉంచుకుని, తొందర పడకుంగా వర్షాలు బాగాకురిసి నేలలో వేడిపోయి తడి వచ్చాకే విత్తనాలు వేసుకోవాలని, ఎలాంటి సందేహాలున్నా రైతువేదికల వద్ద ఏఈవోలను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ■

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు

## నీటి సంరక్షణ - యాజమాన్యం



సూక్ష్మ సాగు - స్ప్రింక్లర్



సూక్ష్మ సాగు - బిందుసేద్యం



పంటకు జీవం
రెయిన్‌గన్



భూగర్భ నీటిని
పంచుకోవడం



ఆరు తడి
పంటలసాగు



సోలార్
పంపుసెట్ల ఏర్పాటు

## భూసార, నీటి సంరక్షణ



గ్రిడ్ లాక్ పద్ధతి



పొలాలలో నీటి కుంటలు
(ఫార్మ్ పాండ్)



చిన్న చిన్న
ఊట కుంటలు



రాతి కట్టలు

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-06-2023 ; Posting Date: 05 & 06-06-2023
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23




ఏపి, తెలంగాణా ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు ఏపిమాస్ శిక్షణ సందర్భంగా .... ఎఫ్ పి ఓల మార్కెటింగ్ వ్యూహాలపై ఇక్రిశాట్‌లో ...





అన్నమయ్య , చిత్తూరు జిల్లాల ఎఫ్ పి ఓల ప్రతినిధుల బృందం కర్ణాటక రాష్ట్రంలో,
నల్లమాడ, గుడిబండ, శెట్టూరు మండలాల రైతులు ' టింబక్టు ' లో అవగాహన పర్యటన దృశ్యాలు

## ఎఫ్ పి ఓలచే వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాల ప్రారంభోత్సవాలు


ధీశాలిచే ధాన్యం సేకరణ కేంద్రం


టి చంద్రవారిపల్లిలో మామిడి సేకరణ కేంద్రం


నల్లమాడలో మొక్కజొన్న సేకరణ కేంద్రం

## ఇ డి పి శిక్షణ


దౌల్తాబాద్‌లో


మద్దూరులో


కోస్గిలో

To ADDRESS


కౌమార బాలికలకు బహిష్టు పై అవగాహన

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి
ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089